ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు  కార్యకలాపాలు

# ANDHRA PRADESH
# LEGISLATIVE COUNCIL DEBATES

అధికార నివేదిక

**OFFICIAL REPORT**

మంగళవారము, ఏప్రిల్ 3, 2007

1వ శా. ప. I స. వాల్యూం -- I నంబరు --2

శక సంవత్సరము - 1929, చైత్రం - 13

**TUESDAY, THE 3rd APRIL, 2007**

**1 L.C. I S. VOL-- I No. - 2**

**13 - Chaitra, 1929 - S.E.**

#

శాసన పరిషత్తు సచివాలయము

పబ్లిక్ గార్డెన్స్

హైదరాబాదు - 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS**
**HYDERABAD**
**500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| ప్రోటెం ఛైర్మన్ | : | శ్రీ పువ్వాడ నాగేశ్వర రావు |
| కార్యదర్శి | : | శ్రీ కె. తుల్జానంద్ సింగ్ |
| అదనపు కార్యదర్శి | : | శ్రీ కె. గోపాలకృష్ణయ్య |
| సంయుక్త కార్యదర్శులు | : | శ్రీ ఎస్. రాజ సదారామ్<br>శ్రీ ఎన్. అంజయ్య |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ డి.శివరావు<br>శ్రీ ఎం. పాండురంగాచార్య<br>శ్రీ ఎం.వి.వి.సత్యానందం<br>శ్రీ పి. సీతారాములు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ కె.ఎ.నర్సింహరాజు<br>శ్రీ డి. నర్సింహులు<br>శ్రీ కె. సుభాష్ చంద్రబోసు<br>శ్రీ కె. తులసీరాం<br>శ్రీ డి. సత్యనారాయణ<br>శ్రీ ఎ. రామిరెడ్డి<br>శ్రీమతి వి. గిరిజా సుందరి<br>శ్రీ ఎస్. జయరాం<br>శ్రీ కె. జగన్నాథరావు |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ మహ్మద్ జహీరుద్దీన్ |

--------

ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ చర్చలు

అధికార నివేదిక

(మొదటి శాసన పరిషత్తు )

(మొదటి సమావేశము : రెండవ రోజు )

మంగళవారము, ఏప్రిల్ 3, 2007

సభ ఉ. గం. 10.00 లకు ప్రారంభమైనది

( ప్రోటెం ఛైర్మన్ అధ్యక్ష స్థానములో వున్నారు )

----------

# విషయ సూచిక

1. ప్రకటన

   అధ్యక్షుని ఎన్నిక గురించి

2. ప్రకటనలు

   1. రాజాజీ యిన్‌స్టిట్యూట్ వారిచే కౌన్సిల్ సభ్యులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ గురించి.
   2. బిజినెస్ అడ్వయిజరీ కమిటీకి సభ్యుల నామినేషన్ గురించి.

-------------

## ప్రకటన

## అధ్యక్షుని ఎన్నిక గురించి

ప్రొటెం ఛైర్మన్: ఈ రోజు మనకు ఉన్న అజెండాలో నూతనంగా ఏర్పడిన కౌన్సిల్‌కి ఛైర్మన్ ఎన్నిక కోసం అన్ని నామినేషన్స్ కాల్‌ఫర్ చేశాము. ఎన్నిక క్రతువు పూర్తయి స్పందనలు, ప్రతిస్పందనలతో కొత్త ఛైర్మన్ వచ్చిన తరువాత, వారు సమావేశాన్ని నడుపుతారు.

re: Election of Chairman.

PRO-TEM CHAIRMAN: I am to announce to the House that under Rule 9 of the Ad-hoc Rules of Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Council firstly I will have to read out the names of the duly nominated members to the Office of the Chairman and the proposers:

| Sl. No. | Name of the Candidate | Name of the Proposer |
|---|---|---|
| 1. | Dr. A. Chakrapani | Sri Singam Basava Punnaiah |
| 2. | Dr. A. Chakrapani | Sri Paladugu Venkata Rao |
| 3. | Dr. A. Chakrapani | Sri P. Sudhakar Reddy |
| 4. | Dr. A. Chakrapani | Sri B. Changal Rayudu |
| 5. | Dr. A. Chakrapani | Sri Yellareddigari Sivarami Reddy |
| 6. | Dr. A. Chakrapani | Sri Nagapuri Rajalingam |
| 7. | Dr. A. Chakrapani | Sri B. Mohan Reddy |
| 8. | Dr. A. Chakrapani | Smt. Majji Sarada |
| 9. | Dr. A. Chakrapani | Dr. K. Rajyalakshmi |

As Dr. A. Chakrapani is the only duly nominated candidate I declare Dr. A. Chakrapani as duly elected to the Office of the Chairman. I heartily congratulate Dr. A. Chakrapani on his election as Chairman and request him to occupy the Chair.

( గౌ.లు శ్రీ ఎం. మారెప్ప, శ్రీ పల్లె రఘునాథరెడ్డి, శ్రీ బి. మోహనరెడ్డి, డా. ఎ. చక్రపాణిగారిని అధ్యక్షస్థానానికి తోడ్కొనిరాగా, గౌరవ సభ్యుల కరతాళ ధ్వనుల మధ్య డా. ఎ. చక్రపాణిగారు అధ్యక్ష స్థానంలో ఆశీనులయ్యారు)

( గౌరవ సభ్యులందరూ బల్లలు చరిచారు )

ఉ . 10.10

ఛైర్మన్ :- గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారు .

శ్రీ వై.ఎస్.రాజశేఖరరెడ్డి :- అధ్యక్షా, ఆంధ్ర ప్రదేశ్ శాసనపక్ష చరిత్రలో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. ఈ రోజు మీరు అధ్యక్ష స్థానంలో కూర్చోవడం నిజంగా శాసనమండలికి, మాకు, ఈ రాష్ట్రానికి ఎంతో గర్వ కారణం. అధ్యక్షా, 1976వ సంవత్సరంలో గవర్నర్ గారు మిమ్మల్ని శాసనమండలి సభ్యునిగా నామినేట్ చేశారు. 1985వ సంవత్సరంలో కూడా గవర్నర్ గారు మిమ్మల్ని మళ్లీ నామినేట్ చేశారు. నామినేట్ అయిన తరువాత, మీరు డెప్యూటీ ఛైర్మన్ అయ్యారు. కొంత కాలానికి కౌన్సిల్ రద్దు కావడంతో మీ సేవలు ఆంధ్రప్రదేశ్ విధానపరిషత్ వాడుకోలేకపోయింది. మారిన కాలమాన పరిస్థితులను బట్టి, సమకాలీన రాజకీయాల్లో కౌన్సిల్ ఉండాల్సిన అవసరాన్ని, ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య వ్యవస్థలు గుర్తించాయి. మళ్లీ కౌన్సిల్ వచ్చిన తరువాత, ప్రభుత్వం, గవర్నర్‌గారు, మీ సేవలు గుర్తుంచుకొని, మళ్లీ మరోమారు గవర్నర్‌గారు మిమ్మల్ని నామినేట్ చేయడం జరిగింది. శాసన మండలికి నామినేట్ చేయబడిన తరువాత , శాసనమండలి సభ్యులందరూ, మీరు హౌజ్‌లో ఉన్నందుకు, మీ కంటే మంచి వారు, అధ్యక్ష స్థానంలో కూర్చొనగల్గిన వారు వేరే లేరన్నట్లు అందరూ ఏకగ్రీవంగా, పార్టీలకు అతీతంగా, అన్ని పార్టీల వారు మిమ్మల్ని ఏకగ్రీవంగా శాసన మండలి అధ్యక్ష స్థానానికి ఎన్నుకోవడం, నిజంగా సభ్యులందరికి గర్వ కారణం. మనందరికి గర్వ కారణం. రాష్ట్రానికే గర్వ కారణం. You have been a multi-faceted personality. మీరు విద్యార్థి దశ నుండి చాలా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాంఘిక సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సేవా తత్పరత మీతోబాటే పుట్టింది. కాలేజీలో ఉన్నప్పుడు, ఉస్మానియా యూనివర్శిటీ లా కాలేజీ యూనియన్ ప్రెసిడెంట్‌గా, గ్రాడ్యుయేట్స్ కాన్‌స్టిట్యుయెన్సీ నుండి, ఉస్మానియా యునివర్శిటీ సెనేట్ మెంబర్‌గా ఎన్నిక కాబడ్డారు. కేంద్ర సాంస్కృతి పీఠం గవర్నింగ్ కౌన్సెల్ మెంబర్‌గా పనిచేశారు. ఆంధ్ర ప్రదేశ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్ అధ్యక్షునిగా పనిచేశారు. సెయింట్ జాన్స్ అంబులెన్స్ అసోసియేషన్‌కి లైఫ్ మెంబర్‌గా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ రెడ్ క్రాస్ సొసైటీలో లైఫ్ మెంబర్‌గా ఉన్నారు. మీరు 'మయూర కళా మండలి' కి అధ్యక్షులుగా ఉంటూ, లిటరరీ ఆర్గనైజేషన్‌లో ప్రత్యేకంగా కృషి చేశారు. కో-ఆపరేటివ్ మూవ్‌మెంట్‌లో పదిలమైన స్థానం ఉంది. మీరు చాలా కో-ఆపరేటివ్ ఆర్గనైజేషన్స్‌లో సభ్యులుగా ఉన్నారు. బలహీన వర్గాలకు సంబంధించి, షెడ్యూల్డ్ కులాలు, తరగతులకు సంబంధించిన కో-ఆపరేటివ్ సంస్థలలో బాగా పనిచేశారు. లైబ్రరీ మూవ్‌మెంట్ మీ దృష్టిని ఆకర్షించకుండా పోలేదు. దామోదరం సంజీవయ్య లైబ్రరీ కమిటి స్థాపించడమే కాకుండా, గౌరవాధ్యక్షునిగా ఉన్నారు. అడల్ట్ లిట్రసీ ప్రోగ్రామ్ ద్వారా విద్యా వ్యాప్తికి విస్తృతంగా కృషి చేశారు. ఆ విధంగా చాలా కార్యక్రమాలు చేశారు. మహిళాభ్యుదయం నిమిత్తం ఎన్.జి.ఓ. ఆర్గనైజేషన్స్‌తో పనిచేశారు. ట్రైనింగ్ కార్యక్రమాలు చేశారు. Educated youth and Welfare schemes కి సంబంధించి You have participated in a number of seminars, conferences and workshops on National Integration, reservation for OBCs etc. మీకు జర్నలిజంలో మంచి ప్రావీణ్యం ఉంది. హైదరాబాద్ నుండి వచ్చిన 'ఆంధ్ర జనత' పత్రికకు సీనియర్ ఎడిటర్‌గా పని చేశారు. చాలా వ్యాసాలు మీ పత్రిక ద్వారా రావడం వల్ల, రాష్ట్ర ప్రజలకు సుపరిచితులైనారు. మీరు మంచి రచయితగా కూడా పేరుపొందారు. శాసనమండలి అవసరాన్ని, శాసనపరిషత్ అవసరాన్ని చారిత్రాత్మకమైన కారణాలతో విశ్లేషిస్తూ మంచి పుస్తకాన్ని ప్రచురించి, ఆ పుస్తకాన్ని భారత ఉపరాష్ట్రపతి భైరాన్‌సింగ్ షకావత్ గారితో ఆవిష్కరింపజేశారు. మీరు Legal

profession and sincere lawyer అనే పుస్తకాన్ని, Sonia Gandhi and Future of India అనే పుస్తకాన్ని 2002వ సంవత్సరంలో ప్రచురించారు. అది హింది, ఉర్దూ, తమిళ భాషల్లో ప్రచురించబడింది. Process of amendments to the Indian Constitution. పుస్తకాన్ని, అలాగే చాలా పుస్తకాలను ట్రాన్స్‌లేట్ చేశారు. ఇంగ్లీష్ నుండి తెలుగు, తెలుగు నుండి ఇంగ్లీష్ భాషల్లో వాటిని అనువదించారు. మీరు సాంఘిక సేవా రంగాల్లో, జర్నలిజంలో పుస్తకాలు వ్రాసిన విషయంలో మీకంటూ రాష్ట్రంలో పదిలమైన స్థానాన్ని ఏర్పాటుచేసుకొన్నారు. సుదీర్ఘమైన చరిత్ర కలిగిన మీరు అందరికి బాగా అనుకూలంగా ఉండి, అజాతశత్రువులుగా పేరు తెచ్చుకొన్నారు. ఏ ఒక్కరైనా మిమ్మల్ని విమర్శించడానికి ఆస్కారం ఇవ్వలేదు. అటువంటి మీరు ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్‌కి అధ్యక్ష స్థానాన్ని వహించడం మీకు, మాకు మండలి సభ్యులందరు చేసిన గౌరవం కాదు, మీరు ఆ స్థానంలో ఉండడం వల్ల, ఆ స్థానానికే గౌరవం వచ్చింది. మండలికే గౌరవం వచ్చింది. మనందరికి గౌరవం వచ్చింది. మిమ్మల్ని భగవంతుడు ఆశీర్వదించి, ఆ స్థానం యొక్క మర్యాదను మరింత పెంచి, అన్ని రకాలుగా శాసనమండలికి ఆంధ్ర ప్రదేశ్ చరిత్రలో ఒక మంచి ఉన్నతమైన స్థానానికి పెంచడంలో మీ పాత్ర ప్రత్యేకంగా ఉండాలని కోరుతున్నాను. మీకు శాసనమండలి, భగవంతుడు అన్ని రకాల మేలు చేయాలని కోరుతున్నాను.

ఉ. 10.20

శ్రీ కె. రోశయ్య : అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు మాట్లాడిన ప్రతి మాటతో నేను ఏకీభవిస్తున్నాను. మీరు అన్ని కోణాలలో కూడా అనుభవజ్ఞులు, సౌమ్యులు. ఈ శాసన మండలి కార్యక్రమాలను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తారన్న విశ్వాసంతో నేను ఉన్నాను. ఈ శాసన మండలి సభ్యులందరూ కూడా ఆ భావనతోనే ఉన్నారు గనుక ఏకగ్రీవంగా మిమ్మల్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంలో కాంగ్రెసు పార్టీ వారు మాత్రమే మిమ్మల్ని ప్రతిపాదించడం కాదు, పార్టీలకు అతీతంగా మిగిలిన వారందరూ కూడా ప్రతిపాదించడంలో సహకరించడంతో ఈ ఏకగ్రీవ ఎన్నిక సాధ్యమైంది. అందువల్ల మిగిలిన సభ్యులందరినీ, జస్ట్ ప్రపోస్ చేసిన వారే కాకుండా అన్ని పార్టీల వారు అందించిన తోడ్పాటు, చూపించిన సహృదయతకు నేను ప్రభుత్వం తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నాను. అందువల్లనే ఈ రోజు నేను, మీరూ కూడా ఇప్పుడు ఇక్కడ పని చేయడానికి అవకాశం కలిగింది. ఎన్నో సందర్భాలలో అనుభవంతో కూడినటువంటి మీ ఆలోచన కారణంగా ఉపాధ్యక్షులుగా పని చేసిన కాలంలో ఎక్కడా ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకోకుండా సర్దుబాటు చేసిన మనస్తత్వం మీ సొంతం. అది శాసన మండలిలోగానీ, శాసన మండలి బయటగానీ, ఎక్కడైనా ఆ మనస్తత్వమే కలిగిన మీరు ఈ రోజు ఏకగ్రీవంగా అధ్యక్షులుగా ఎన్నికై ఈ పదవికి వన్నె తెచ్చారు. మీ బాధ్యత నిర్వహణలో తప్పనిసరిగా మా అందరి సహకారం ఉంటుందని, మీ పదవీ కాలం జయప్రదంగా కొనసాగాలని, అదేవిధంగా ముగియాలని నేను మనసారా కోరుకుంటున్నాను.

ఇక్కడే , ఈ రాష్ట్రంలోనే కాదు దేశ వ్యాప్తంగా, ప్రపంచంలో ఉన్న మరి కొన్ని ప్రజాస్వామ్య దేశాలలో చట్ట సభలలో కొంచెం పాత ఆలోచనలు, పద్ధతులు మారుతున్నాయన్న ఆందోళన చెందుతున్న వారున్నారు. అటువంటి అశేషమైన వారిలో నేనూ కూడా ఒకడిని. ప్రశ్నోత్తరాల సందర్భంలో, చట్ట సభలలో చట్టాలు చేయడంలో ప్రజాస్వామ్య పద్ధతులను అనుసరించి వ్యవహరించాలని, సభను నడుపుకోవాలని నమ్మేవాడిని నేను. నేను ఈ ఆలోచనతో, ప్రజాభిప్రాయాలను గౌరవించే విధంగా ఆకాంక్షిస్తున్నాను. ఈ సందర్భంలో మనం సభను కూడా ఆ విధంగా నడుపుకోవాలని కోరుతున్నాను. నిన్నటి రోజున శాసన మండలిని పునః ప్రారంభించడం జరిగింది. పెద్దలైన కొందరు ఇది అవసరం లేదనే అభిప్రాయం కూడా వెలిబుచ్చారు.

వారి అభిప్రాయాన్ని నేను తప్పుపట్టను. ఎవరి అభిప్రాయాలు వారివి. అయితే , మన మండలి నడిచే విధానం చూచిన కొంత కాలం తర్వాత వారందరి అభిప్రాయ సరళిలో కూడా మార్పు వస్తుందని ఆశిస్తున్నాను. ఆ విధంగా ఇక్కడ చర్చలు సమర్థవంతమైన స్థాయిలో జరుగుతున్నాయనే భావన వారిలో కలుగ జేయాలి. ఆ విధంగా ఉన్నత స్థాయిలో మండలి కొనసాగాలని తెలియజేస్తున్నాను.

ఈ సభలో ఈనాడు నేను సభ్యుడిని కాకపోయినా, 17 సంవత్సరాలు నేను సభ్యుడిగా ఉన్న గత అనుభవంతో, అనేక మంది యువకులు, విద్యావంతులు, వివిధ రంగాలలో ప్రావీణ్యులైన వారైన మీ అందరి ద్వారా, మీ ద్వారా (ఛైర్మన్‌ను ఉద్దేశించి), మీ అనుమతి ద్వారా ఇక్కడ జరిగే చర్చల వల్ల, చట్ట సభల స్థాయి ఔన్నత్యం సాధిస్తుందనీ, ఆ విధంగా మన రాష్ట్రాన్ని దేశంలోని ఇతర రాష్ట్రాలలోని చట్ట సభల కన్నా అన్ని విధాలుగా ముందుండే విధంగా తమరు మన ఈ శాసన మండలిని ముందుకు తీసుకు వెళ్తారన్న భావనను నేను కలిగి ఉన్నాను. మనను ఎన్నుకున్న ప్రజా బాహుళ్యంలో కూడా ఇదే నమ్మకం కలిగే విధంగా వ్యవహరిస్తారనే భావన మీపై మాకు ఉంది.

శాసన సభలో చట్టాలు చేయడం జరుగుతోంది. దిగువ సభలో చట్టాలు చేసిన తర్వాత ఎగువ సభలో కూడా దీనిని మరొకసారి చర్చ చేయడం జరుగుతుంది. అందరి భావనా ఒకటే. ముఖ్యమంత్రి గారు, ఇతర పెద్దలూ మాట్లాడి ఒక చట్టం చర్చకు తీసుకు వస్తారు. దిగువ సభలో చర్చ జరిపిన తర్వాత, దానిని హైయ్యర్ సభలో మరొక సారి విస్తృతమైన చర్చలు జరపడం ద్వారా సమర్థ వంతమైన చట్టాలను మనం తేగలుగుతాము. చట్టాలు తేవడంలో శాసన సభలో చర్చలు జరిగే విధంగా, ఉద్రిక్త వాతావరణం ఉండకుండా, ఎగువ సభలో చర్చ జరిగితే అది అర్థవంతంగా ఉంటుందని, ఎక్కడా అందులో పొరపాట్లు దొర్లడానికి వీలులేదనే భావన అందరికీ ఉంది. ప్రతి రాజ్యాంగంలో దేశ స్థాయిలో అంతరంగిక ఎజెండా ఉండే విధంగా ఇది ఫంక్షన్ చేస్తున్నది. రాజ్యాంగ సూత్రాలకు అనుగుణంగా, అవసరాలకు ప్రజాభిప్రాయాలకు అనుగుణంగా చాలా కాలంగా, చాలా చోట్ల ఈ రెండు సభలు కొనసాగుతున్నాయి. అందుకే, పెద్ద రాష్ట్రమైన మన రాష్ట్రంలో కూడా మనం మండలిని ప్రారంభించాలని అనుకున్నాము. కొందరు దీనిని వ్యతిరేకించినప్పటికి , చట్టాలను జాగ్రత్తగా చేసుకోవడానికి వీలుంటుందన్న భావన మనం కలిగి ఉన్నాము కనుక నేడు శాసన మండలిని మనం పునః ప్రారంభం చేసుకున్నాము.

చర్చల సరళిని చూసిన అందరికీ కూడా ఈ శాసన మండలి గురించి మంచి భావన కలుగుతుందని భావిస్తున్నాము. శాసన మండలిలో ప్రశ్నోత్తరాలు అయిన తర్వాత ఏదైనా ప్రధాన అంశానికి సంబంధించి చర్చ జరిగితే, అది ఏ విధంగా జరుగుతుందోనన్న భావంతో నాడు పెద్దలు, నాయకులు ఇక్కడకు వచ్చి ఆలకించే వారు. ఒకప్పుడు గొప్ప దేశ భక్తులు, కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాలను నిర్వహించే గౌ. పుచ్చలపల్లి సుందరయ్య గారు వారికి కేటాయించిన స్థానంలో కూర్చుని ఆ విధంగా చర్చలను వినేవారు. వారు చాలా మేధావి అని మనందరికీ తెలుసు. కొన్ని సందర్భాలలో మేధావులు, పెద్దలు అయిన వివిధ పార్టీల ఇతర నాయకులు, మంత్రులు కూడా లోపలికి వచ్చి, కూర్చునేందుకు స్థలం లేకపోతే నిలబడి అయినా సరే మండలి సభలో జరిగే చర్చలను వినే వారు. అదే విధంగా మనందరికీ తెలిసిన మేధావి నాయకుడు గౌ. వావిలాల గోపాల కృష్ణయ్య గారు శాసన సభలో తమ బిజినెస్ అయిపోయిన తర్వాత ఇక్కడ ప్రధానమైన విషయాలపై చర్చ జరుగుతుంటే కూర్చునేందుకు స్థలం లేకపోతే నిలబడి అయినా ఆ చర్చలను ఆలకించే వారు. ఆనాడు వారికి ఈ సభల పట్ల గౌరవం, చట్టాల పట్ల, అర్థవంతంగా జరుగుతున్న చర్చల పట్ల అవగాహన ఉండేది. అందువల్ల అవి ఏ విధంగా చర్చించ బడుతున్నాయో తెలుసుకోవాలనే ఆసక్తి కూడా

అందరికీ ఉండేది.  అలాంటి మంచి, మహత్తర ఆలోచనలు నాడు వారు చేయడంవల్ల , నాడు ఇక్కడ కేటాయించిన విఐపి గ్యాలరీకి గౌరవం, హుందాతనం వచ్చింది. కౌన్సిలు సమావేశాలను ఇంతటి పెద్దలు అలకించడం మూలంగా వాటికి చాలా గౌరవం వచ్చింది.  ఆ రోజులలో ఆ రకమైన వాతావరణాన్ని ప్రజలు అంతగా ఇష్టపడ్డారు.

కోటాను కోట్ల రూపాయలను ఖర్చు పెడుతున్నారని, ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోబడిన వారు ఏ విధంగా ఉంటారో అన్న ఆలోచనతో ఈరోజు అనేక మంది ఉన్నారు.  గౌ. వై.బాగా రెడ్డి, ముఖ్యమంత్రిగారు, నేనూ ఇతరులూ అందరూ కలసి ఈ శాసన మండలి ప్రజలు ఆశించిన రీతిలో ఉండాలనే కోరికతో బి.ఎ.సి.లో మేము, తమరు అధ్యక్షునిగా ఉండాలని భావించడం జరిగింది.  మన కమిట్‌మెంట్‌కు ఇది నూతన అధ్యాయం.  ముఖ్యమంత్రి గారు చెప్పినట్లు  ఇది ప్రారంభమే కాకుండా ఇక్కడి చర్చల సరళిద్వారా బయటివారికి మండలి పనితీరు తెలియచేయాలి.  అందుకుగాను పెద్దలు చేసే చర్చలు దేశానికి స్ఫూర్తి దాయకంగా ఉండాలని, ఈ శాసన మండలి అందరికీ ఆదర్శవంతంగా , రాణింపు తెచ్చుకునేలా ఉండాలని తమరి ద్వారా నేను కోరుతున్నాను.
ఉ.10.30

చర్చల సరళిలో కూడా ఆదర్శవంతమైన సభగా పేరు తెచ్చుకోగలిగితే, నావరకు నేను అనుకుంటున్నాను, అంతకంటే మంచిరోజు, ఆనందకరమైన రోజు నా జీవితంలో మరొకటి ఉండదు. ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో కార్యక్రమాలు బాగా జరుగుతున్నాయనే భావన దేశంలో ఉన్న మిగిలిన సభలు నిర్వహించేవారి మనసులలో కలిగితే అదే మనకు గొప్ప. సందర్భాన్నిబట్టి కొన్ని సమస్యలమీద ఉద్రేకపూర్వకంగా మాట్లాడవలసిన అవసరం ఉంటే వారి ఉద్రేకాలను అణచుకోవాలని నేనుగాని, మరొకరుగాని అనరు.  అయితే ప్రజాస్వామ్య పద్ధతిలో మనం వ్యవహరించటానికి తయారుగా ఉండాలి.  శాసనసభ కార్యక్రమాలు అక్కడ జరుగుతాయి.  పార్లల్‌గా ఇక్కడ కూడా సమావేశాలు జరుగుతాయి.  ప్రభుత్వం తరపున మంత్రులు రెండు బ్యాచెస్‌గా ఉంటారు.  అక్కడ వారి వర్కింగ్ ఉన్నప్పుడు ఇక్కడ ఉండకుండా, ఇక్కడ ఉన్నప్పుడు అక్కడ ఉండకుండా చేసుకోవాలి.  వర్కింగ్ ఎరేంజ్‌మెంట్స్‌ను తమ నేతృత్వంలోని మీ కార్యాలయం చూస్తుంది. నలుగురి సహకారం ఉంటుందని అనుకుంటున్నాను.  అందరం కలసి చేద్దాము.

తమకు మంచి ఆరోగ్యాన్నే కాకుండా సహనాన్ని, ఈ సభను చక్కగా నడిపించే మంచి పరిపక్వతను ఇవ్వాలని భగవంతుని కోరుతున్నాను.  మీగురించి ముఖ్యమంత్రిగారు చాలా వివరంగా చెప్పిన తరువాత మాట్లాడటానికి నాకేమీ మిగలలేదు.  అన్ని విషయాలు వారు చెప్పారు.  తమరు న్యాయశాస్త్రంలో పట్టా పుచ్చుకున్నారు.  అనేక గ్రంధాలు వ్రాశారు.  మనకు ఉన్న విశ్లేషణాత్మకంగా ఆలోచించే కొద్దిమందిలో తమరు ఒకరు.  ఈ సందర్భంగా నేను మరొక మాట చెప్పటం కూడా అనుచితం కాదేమో!  ఈ కౌన్సిల్ ఏర్పాటుచేసుకోవటంలో మీ కంట్రిబ్యూషన్ చాలావరకు ఉన్నది.  దీనిని క్రియేట్ చేయాలనే మీ విశ్వాసం హర్షణీయం.  ప్రభుత్వపరమైన పాత్రకాకుండా మిగిలిన స్పేడ్ చేయటంలో మీరు నిర్వహించిన పాత్ర ఎంతో ఉన్నది.

మిస్టర్ ఛైర్మన్: ముఖ్యమంత్రిగారు, మీరు కూడా ఎంతో పాత్ర నిర్వహించారు.

శ్రీ కె. రోశయ్య: అంతా జరిగింది ముఖ్యమంత్రిగారిద్వారానే. ఈ సందర్భంగా మీ కృషి కూడా అభినందనీయం. గౌరవసభ్యులందరూ కూడా హృదయపూర్వకంగా అభినందించారు. ఏకగ్రీవంగా తమరిని ఎన్నుకోవటంద్వారా ఊహించని రీతిలో తొలిమెట్టు జయప్రదంగా ముగిసింది. అదేవిధంగా ఈ సభ కూడా సజావుగా సాగించటానికి దోహదపడే రీతిలో ప్రతి పార్టీ నూతన సభ్యులు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరుతూ వారికి పేరుపేరునా కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియచేస్తూ శెలవుతీసుకుంటున్నాను.

శ్రీ పి. నాగేశ్వరరావు: అధ్యక్షా, ఈరోజు ముఖ్యమంత్రిగారు చెప్పినట్లు ఆంధ్రదేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించవలసిన రోజు. కాంగ్రెస్‌పార్టీ, రాజశేఖరరెడ్డిగారి నాయకత్వాన ఎన్నికలకంటే ముందే వారి మేనిఫెస్టోలోపెట్టి ప్రజల ఆమోదంపొంది దానిని వాస్తవ రూపం ధరింపచేయటానికి మూడేళ్ల సుదీర్ఘ పోరాటం లేక ప్రయత్నాలుచేసి రద్దైన శాసనమండలిని, విధానపరిషత్‌ను పునరుద్ధరించటం జరిగింది. అటువంటి ఈ సభకు ఈ రోజు మీరు ఏకగ్రీవంగా అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టినందుకు మీ సహచరుడిగా నాకు సంతోషంగా ఉన్నది.

ఆనాడు పాంచజన్యంగారు చనిపోయినప్పుడు ఏర్పడిన డెప్యూటి ఛైర్మన్ ఖాళీని భర్తీచేయటానికి మీ పేరును ప్రతిపాదించిన టైమ్‌లో నేను కూడా ఈ హౌస్‌లో ఉన్నారు. నాకు బాగా గుర్తు, ఛైర్మన్‌గా ముఖాషిర్ షా ఆనాడు ఉండేవారు. మీరు పదవికి వన్నె తెస్తారని ఆనాడు కూడా అనుకున్నాము. ఈనాడు అంతకంటే అత్యున్నతమైన బాధ్యత, ఈ సెకండ్ హౌస్‌ను నడిపించే బాధ్యత మీకు కలిగింది. అదే సంపూర్ణమైన విశ్వాసంతో ఈ సభను నడిపించటానికి, అన్ని పార్టీలయొక్క తోడ్పాటును పొందటానికి మీ వైపునుండి ప్రయత్నం జరుగుతోంది. మేము కూడా అటువంటి ప్రయత్నానికి సంపూర్ణంగా మద్దతు ఇస్తామని తెలియచేస్తూ నా తరపున, నా పార్టీ తరపున మిమ్మల్ని అభినందిస్తున్నాను. ఈ సందర్భంగా రెండు మాటలు చెప్పటం సముచితమని నేను భావిస్తున్నాను.

ఇప్పుడే రోశయ్యగారు మనవిచేసినట్లు కారణాలు ఏవైనా కానీయండి భారతదేశంలో శాసన వ్యవస్థను ఇంకా సజావుగా నడిపి, ప్రభుత్వంయొక్క వైఫల్యాలను బయటపెట్టి, ప్రభుత్వాన్ని ఇంకా సక్రమంగా ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయించటానికి ప్రతిపక్షంలో ఉన్నప్పటికి, ప్రభుత్వపక్షంలో ఉన్నప్పటికి ఎన్నికైన ప్రతి బాధ్యత కలిగిన సభ్యుని కర్తవ్యం. ఆ బాధ్యతలను మనం సక్రమంగా నిర్వర్తించాలి. కాని దురదృష్టవశాత్తు, కారణాలు ఏవైనా కానీయండి, ఆ బాధ్యతలనుండి తప్పుకుంటున్నాము. శాస్త్ర, సాంకేతిక యుగం చాలా ముందుకుపోతోంది. సైంటిఫిక్, టెక్నలాజికల్ రివల్యూషన్ వచ్చింది. ఎలక్ట్రానిక్ మీడియా వచ్చింది. ట్రాన్సపరెన్సీ ఇస్తామని మనం కూడా చెప్పాము, ప్రభుత్వాలు కూడా కమిట్ అయి ఉన్నాయి. ఈ యుగంలో ఉన్నది ఉన్నట్లు ప్రజల మనసులలోకి పోవటానికి అడ్డంకులు కొన్ని సృష్టించబడుతున్నాయి. కారణాలు ఏవైనా కానీయండి, అతి ఉత్సాహం ప్రదర్శించటం కానీయండి లేకపోతే సాంప్రదాయాలకు భిన్నమైన రీతిలో మాట్లాడటం కానీయండి లేకపోతే సభ్య ప్రపంచాన్ని మరచిపోయి వారికి తోచిందేదో మాట్లాడటం కానీయండి, కేవలం ప్రచారం పొందటం అనేది ఈరోజు జరుగుతోంది. నావంటి వాడికి బాధ కలుగుతోంది. ఏక వచన ప్రయోగాలు, అటువైపునుండి కానీయండి, ఇటువైపునుండి కానీయండి, ఏ హౌస్‌లోనైనా జరగకూడదు. 'మీరు' అనికాని, 'తమరు' అనికాని సంబోధించిన కాలాన్ని మనం చూశాము. కాని ఈరోజు "నువ్వేంటి, నీ లెక్కేంటి, రా" అంటున్నారు. 'రా' అని అనటానికి, ఈ మాటలు అనుకోవటానికి ఇక్కడకు రావలసిన అవసరం లేదు. సభా సాంప్రదాయాలు కొన్ని ఉన్నాయి. వాటిని అనివార్యంగా పాటించాలి. మీకు వెన్ను చూపించి వెనక్కు వెళ్లిపోకూడదు. రెండు అడుగులు, మూడు అడుగులు వెనక్కు నడిచి మా ఇష్టం వచ్చినట్లు వెళ్లవచ్చు.

These are the rules. సుందరయ్యగారు, తెన్నేటి విశ్వనాధంగారు పాటించారు, పెద్దలందరూ పాటించారు, మేమంతా పాటించాము. రోశయ్యగారు, కోన ప్రభాకరరావుగారు, మేమందరం కూర్చునేవారము. ఎవరికి ఇష్టం లేకపోతే వారు కాలయాపన చేయటానికి బయటకు వెళ్లటానికి కూడా పర్మిషన్ తీసుకుని వెళ్లటం జరిగేది. మేము వచ్చేప్పుడు, కూర్చునేప్పుడు రాజ్యాంగం ప్రకారం సృష్టించబడిన ఛైర్‌యొక్క గౌరవం కాపాడుతూ, సభా సాంప్రదాయాలు కాపాడుతూ ప్రవర్తించేవారము. అందులో మీరు ఉండవచ్చు, మరొకరు ఉండవచ్చు. ఛైర్‌కు ఇచ్చే గౌరవం ఇవ్వాలి. లేదంటే ఇక్కడ చర్చలు సజావుగా జరగవు, నిర్మోహమాటంగా జరగవు. నేను 15 ఏళ్ల శాసనసభ్యునిగా ఉన్నాను. ఇంతకాలంలో వెల్‌లోకి, పోడియంవద్దకు ఎన్నడూ వెళ్లలేదు. ఒకే ఒక్కసారి అగౌరవమైన పదం వాడితే, బాధ్యతాయుతమైన మనుషుల యెడల అగౌరవమైన పదం వాడితే సీటునుండి లేచివచ్చి ఎదురు నిల్చున్నాము.
ఉ.10.40

నా సీటు నుంచి వచ్చి ఎదర నిల్చున్నాను. That iteself is protest in those days. వారి సీట్లో వారుంటేనే ఓటు లెక్కేస్తారు. మాట్లాడే అధికారం వుంటుంది. Threse are the Principles. ఆ రోజుల్లో ఉన్నచోటనే నిలబడి మాట్లాడడమనేది జరిగేది. ధైర్యముంటే అక్కడే నిలబడి మాట్లాడేవాళ్లం. కాకపోతే కొంచెం సేపైన తరువాత ఆగి మాట్లాడదామనుకునేవాళ్లం. ఎందుకంటే ఆలోచనలేమీ ఎక్కడికీ పోవు కదా? వచ్చిన ఆవేశమంతా చూపెట్టి అత్యుత్సాహం ప్రదర్శిస్తే వచ్చే ప్రాచుర్యం కంటే కూడా ఎంత లోతుగా అంశం మీద చర్చిస్తున్నాం, సామాజిక ప్రయోజనాలు ఈ చర్చ వల్ల అమలు జరుగుతాయి, ఈ చర్చల వల్ల ప్రభుత్వాన్ని ప్రభావితం చేసి ప్రజలకు మేలు ఎట్లా చేస్తున్నాం? ఇలాంటివి ఆలోచించాలి. లేకపోతే ఇవ్వాళ మన కర్తవ్యం శాసన సభలో కాని శాసన మండలిలో కాని మన చర్చల వల్ల ఫలానా వర్గాలకు చెందిన ప్రజలు ఏ మేరకు లాభ పడ్డారనే అంశంతో పని చేస్తూ వున్నప్పుడు మనం సంతోషించాలి. బాగా ఎక్కువ గొంతు చించుకొని లేదా గట్టిగా మాట్లాడి, ఇతర సీన్స్ క్రియేట్ చేసే దాని వల్ల మనం చేయగలిగిందేమీ లేదు. నాకు గుర్తుంది. ఎన్‌టి రామారావు గారు అమోఘమైన మెజారిటీతో గెలిచారు. మనం ఊహించలేదు. కాంగ్రెస్ పార్టీ కాని, కమ్యూనిస్టు పార్టీలు కాని ఊహించని మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తరువాత వారికి అంతకుముందున్న భిన్నమైన అనుభవాలు వేరు. ఈ శాసనసభలోకి వచ్చిన తరువాత ఇక్కడున్న అనుభవాలు వేరు. వారు ఇక్కడికి వచ్చిన తరువాత ఈ శాసన సభ కార్యక్రమాల్లో మర్యాద నేర్చుకోవటానికి కూడా ప్రయత్నం చేశారు. తెలియనప్పుడు తెలుసుకోవటానికి ప్రయత్నం చేశారు. ఇప్పట్లాగే ముఖ్యమంత్రి గారి ప్రక్కన కూర్చున్నట్లే రోశయ్య గారి సీటు ప్రక్కనే వారి(ఎన్‌టి రామారావు)ఛైర్ వుండేది. వారు ఒకసారి మధ్యలో కొచ్చి వెనక్కు తిరిగారు. నేను రాజర్షిని అన్నారు. అప్పుడు సభలో నేనున్నాను.... మీరు కూడా వున్నారు...... నేను రాజర్షిని చూడండి అని పంచెకి వున్న గోచిని వారు ప్రదర్శించటం జరిగింది. మాన్యుడు.... ఎక్కడున్నారో కాని..... ఆయనకు చెప్పాం ..... అధ్యక్షా, ఇది సభా సాంప్రదాయం కాదు..... అన్నప్పుడు వారు చాలా గౌరవ భావంతో He is one of our leaders because he changed the Society in one aspect, we may differ in other aspect. చాలా అణకువ, మర్యాదతోనే నాకు ఈ విషయం తెలియదన్నారు. అప్పుడు ముఖస్సిర్ షా గారు అధ్యక్ష స్థానంలో వున్నారు ..... లేదండీ..... నేను రాజర్షిని అన్నారు. మీరు రాజర్షి అయినా ఇంకొకళ్లు అయినా మీరు అలా ప్రదర్శించిన పద్ధతి బాగా లేదండీ అన్నప్పుడు ఆయన అన్ కండిషనల్‌గా నాకు ఈ సాంప్రదాయాలు తెలియవు అన్నారు.

మిస్టర్ ఛైర్మన్: అప్పుడు రోశయ్య గారు ప్రతిపక్ష నాయకులు......

శ్రీ పువ్వాడ నాగేశ్వర రావుః అవును. సార్ ...... అధ్యక్షా, అందరూ సందాగా మాట్లాడుతూ వుంటారు. అసలు ఆ మండలి రద్దు కావటానికి మన రోశయ్య గారు, రామారావు గారు, రామోజీ రావు గారు కారణమంటూ వుంటారు. ఆ ముగ్గురు ఆర్‌లు కలిసి 22 ఏళ్ల క్రితం ఈ మండలి రద్దు కావటానికి కారణమని చెబుతుంటారు. సరదాకే అనుకోండి.... ఏదైనా అనుకోండి..... కాని తిరిగి మండలిని ఇప్పుడు పునరుద్ధరించటంలో కూడా రోశయ్య గారు బాధ్యత వహించారు. అదే కాలంలో ఆయన (ఎన్‌టి రామారావు ) 1983లో రద్దు చేయాలని తీర్మానం చేశారు. కాని తీర్మానం అయితే అమలుజరగలేదు నాకు తెలిసినంతవరకు. మళ్లీ 1985లో తీర్మానం చేశారు. ఈ లోపల భారతదేశంలో ప్రధానమైన ఘటన జరిగింది. శ్రీమతి ఇందిరాగాంధీగారి హత్య జరగటం, తరువాత రాజీవ్ గాంధీగారు ప్రధాన మంత్రి కావటం. ఆ సంధి యుగంలో అక్కడ ఒక పార్టీ అధికారంలో వుంది. ఇక్కడ ఒక పార్టీ అధికారంలో వుంది. ఇక్కడ మనం పాస్ చేసినా అక్కడ వారు పాస్ చేస్తేనే అది అమలుజరుగుతుంది. ఘర్షణ వాతావరణ మంచిది కాదని భావించి అక్కడి వారు కూడా పాస్ చేసి వుంటారు. మనం ఏదైనా సృష్టించదలచుకున్నప్పుడు , ఏదైనా చేయదలచుకున్నప్పుడు కాంకరెన్సీ కావాలి. కాబట్టి ఈ రెండు చోట్లా మనమే మెజారిటీలో వుంటేనే అది అమలు జరుగుతుంది. ఇవ్వాళ అనేక వాదప్రతివాదాలున్నాయి.ఎవరి ఇష్టాయిష్టాలతోనోసమస్యలు పరిష్కారం కావు.

మిస్టర్ చైర్మన్ః కాని అప్పుడు రద్దు 30 రోజుల్లో అయింది.

శ్రీ పువ్వాడ నాగేశ్వర రావుః అయ్యింది. అవ్వాల్సొచ్చినప్పుడు అయ్యింది. సృష్టించటానికి మూడేళ్లు పట్టింది. అధ్యక్షా, నేను చెప్పగలిగేది ఏమంటే ఈ పునరుద్ధరించబడిన హౌస్..... నిన్న గవర్నరు గారు కానివ్వండి, ముఖ్యమంత్రి గారు కానివ్వండి.... అదర్ హౌస్ స్పీకర్‌గారు కానివ్వండి.... వారు కోరుకున్నట్లు పరస్పరం వన్నె తేవాలి. ఇక్కడ జరిగే చర్చలకు సుందరయ్య గారి లాంటి వారు ప్రభావితమై ఇక్కడికి వచ్చి కూర్చున్నారంటే అది మామూలు విషయం కాదు. అట్లాగే మనం కూడా ప్రభావితమై అక్కడికి పోయి కూర్చుందాము. నేను కూడా అక్కడ కూర్చున్నాను. ఇక్కడ అయిపోతే అక్కడికి వెళ్లి కూర్చొనటానికి కూడా ప్రయత్నం చేశాము. Nothing wrong in this ... పరస్పరం నేర్చుకోవలసిందే. సభా సాంప్రదాయాలను కాపాడుకుందాము. చర్చలకు ప్రాధాన్యత ఇద్దాము. ఎన్ని గంటలైనా సరే, అవసరమైతే ఇంకొక గంట ఎక్కువ కూర్చుందాము. కాని టైం వేస్ట్ చేసి మళ్లీ మధ్యలో మీ ఛాంబర్స్‌లోకి పిలిచి అందర్నీ బ్రతిమాలుకోవటం.... ఇలాంటివి వద్దు. మనకైతే లేవు ఇలాంటివి వెనకటికి. ఈ 22 ఏళ్ల మధ్య కాలంలో నేను అక్కడ కూడా ఓ పదేళ్లు వున్నప్పుడు తెలుసు. అటువంటి సీన్ ఇక్కడ పునరావృతం కాకుండా ఈ సభ ప్రభావితం చేయాలి. ఆ సభ మనల్ని ప్రభావితం చేయాలి. మంచి పద్ధతుల్లో పరస్పరం ప్రభావితం కావాలి. ఆంధ్ర దేశానికి మేలు జరగాలి . ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి జరగాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఈ పొలిటికల్ పార్టీలు ఎట్లా ఫంక్షన్ చేస్తున్నాయో ప్రజలు గమనించడానికి అవకాశం కలగాలి. ఇది మీ నాయకత్వంలో జరగాలి. నాకున్న విశ్వాసం ఏమిటంటే వారు చెప్పినట్లు మీరు బహుముఖమైన ప్రజ్ఞగలవారు . నేను మీతో చాలా కాలంగా క్లోజ్ గా వున్నాను కాబట్టి చెప్పగలుగుతున్నాను. మీ ప్రజ్ఞను ప్రతిభాపాటవాలను ఉపయోగించుకుని సభను నడిపించండి. మేమంతా నిండు మనసుతో సహకరిస్తాం . పార్టీలు భిన్నమైనవే కావచ్చు . కొన్ని సందర్భాలలో భిన్నంగా మాట్లాడుతాం . మా పద్ధతులు, మాపార్టీ సాంప్రదాయ విధానాలు సిద్ధాంతాల గురించి మాట్లాడతాం . కానీ అల్టిమేట్‌గా ఈ హౌస్‌నుంచి మరింత వన్నె తెచ్చే చర్చలు జరిగాయని అందరూ అనుకోవాలి. గతంలో కూడా ఆ సభలో పాస్ అయినప్పటికీ ఇక్కడ రోశయ్యగారితోకలిసి పబ్లిక్ సెక్టార్స్‌ను మూసేయడానికి లేదా అమ్మేయడానికి ప్రతిపాదనలు వస్తే ఈ హౌస్‌లో మేము ఆపు జేసిన ఘటనలున్నాయి. ఈవాళ still they are in the

existence, we are proud of it. వాటిని మూసేయడమో, లేక బజారున పడేయడమో తేలికే. కాని బాధ్యతగా నడపడమనేది చాలా కష్టంతో కూడుకున్న పని. కూలగొట్టడం లేదా distruction is very easy. అందుకని నిర్మించే దాంట్లో గానీ, లేదా పునరుద్ధరించడంలో గానీ కష్టాలుంటాయి. ఈ సభ పునరుద్ధరించటం మాకు ఏదో ఉద్యోగాలు కల్పించడం కోసం కాదు. కొంతమంది అనుకుంటున్నట్లు మాకు ఏదో పని లేక ఇక్కడికి రాలేదు. We got every purposeful life and lead a purposeful life అని నమ్మేవాళ్లలో నేను ఒకణ్ణి . అందుకే బాధ్యతాయుతమైన పౌరులుగా మమ్మల్ని ఇక్కడికి పంపించారు. కాబట్టి ఇక్కడ ప్రజల గురించి చర్చించాలి, ప్రజల బాగోగుల గురించి చర్చించాలి, ప్రభుత్వం యొక్క తప్పొప్పుల గురించి, తప్పుంటే తప్పని, ఒప్పు ఉంటే ఒప్పు జరిగిందని We should congratulate, తప్పు జరిగి వుంటే We should criticize, అందులో మొహమాటాలు మనకు అక్కర్లేదు. దాని వల్ల మంచి జరగాలి. అల్టిమేట్‌గా ఉన్నత సాంప్రదాయాలు గల్గిన శాసనపరిషత్‌గా ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్ పరిఢవిల్లడానికి మీ నాయకత్వాన్ని ఉపయోగించాలని మా వైపు నుంచి అటువంటి సహకారం ఇస్తామని, కావాలంటే ఇతర సభ్యుల సహకారాన్ని అర్థిస్తామని నిండు మనసుతో ఈ సభలో మీరు జయప్రదం కావాలని, ఇవ్వాళ ఈ సభ క్రియేట్ చేసిన పర్పస్ జయప్రదం కావాలని నేను మరొకసారి కోరుకుంటూ, ఈ సభ పునరుద్ధరించబడడంలో సహకరించిన మీకు, రోశయ్యగారికి, మరియు ఈ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుకుంటూ సెలవు తీసుకుంటున్నాను .

జైహింద్.

ఉ.10.50

శ్రీ పాలడుగు వెంకట్రావ్ : అధ్యక్షా, తమరు ఈరోజు ఈ అత్యున్నతమైన సభకు అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా మన లీడర్ పెద్దలు రాజశేఖర్‌రెడ్డిగారు వెలిబుచ్చిన అభిప్రాయాలతో ఏకీభవిస్తూ, ముఖ్యంగా వారు చెప్పిన రెండు మాటలు అత్యున్నతమైన ఈ స్థానానికి ప్రత్యేకంగా ఉన్నాయి. మీరు అజాత శత్రువని, అనేక రంగాలలో మీరున్నట్లుగా వారు గుర్తు చేయడం జరిగింది. ముఖ్యంగా మీకు, నాకు మూడున్నర దశాబ్దాలుగా అనుబంధం వుంది, ఈ అనుబంధం రాజకీయ అనుబంధం . ముఖ్యమంత్రిగారు చెప్పినట్లుగా అజాత శత్రువు లక్షణాలు ముమ్మాటికీ మీలో వున్నాయి. అనేకసార్లు పార్టీలో గానీ, బయట గానీ చర్చలు కొంచెం హాట్ హాట్‌గా జరిగినప్పటికీ మీరు వాటిని ప్రశాంతంగా పరిష్కరించడం, మెత్తటి మాటలు చెప్పి అందరినీ సముదాయించినటువంటి ఘటనలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా రెండో భాగాన్ని నేను ఆవిష్కరించవలసిన అవసరం వుంది. మీరు ఈ ఛైర్‌లో కూర్చోవడమే గాకుండా , ఈ సభలో ఉండడమే గాకుండా బయట కూడా మీరు కాంగ్రెస్ పార్టీని ఒంటి చేత్తో నడిపిన రోజులున్నాయి. గాంధీభవన్‌లో ఉండి మీరు కాంగ్రెస్ పార్టీని నడిపిన రోజులు నాకు గుర్తున్నాయి. 1972 లో నేను శాసన మండలికి రావడం, రావడం రావడమే నేను రోశయ్య గారిని కలిసి అనేక విషయాలు వారి నుంచి తెలుసుకున్నాను. అంతకు ముందే ఆయన స్వతంత్ర పార్టీ లీడర్‌గా ఉన్నపుడు చూశాను. ఇక్కడ రోశయ్యగారితో కలిసి ఆరు సంవత్సరాలు కూర్చున్నాను. వారు నాకు అనేక మంచి విషయాలు నేర్పారు. సభలో ఏవిధంగా నడుచుకోవాలి, ఎలా వ్యవహరించాలనే తదితర విషయాలన్నీ నేర్చుకోవడం జరిగింది. అందుకు నేను వారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

అధ్యక్షా, ఇక్కడ రెండు విషయాలు చెప్పవలసిన అవసరం వచ్చింది. మిత్రులు పువ్వాడ నాగేశ్వరరావుగారు ఏవిధంగానైతే రెండుసార్లు అక్కడ ఇక్కడ ఉన్నారో నేను కూడా రెండుసార్లు అక్కడ ఇక్కడ

వున్నాను. ఈ ఛైర్మన్‌కు, ఈ స్థానానికి వున్న ఔన్నత్యం, గొప్పతనం ఒకసారి గుర్తు చేసుకుంటే ఈ స్థానానికి వున్న ప్రాధాన్యత ఏమిటో మనకు తెలుస్తుంది. పెద్దలు పిడతల రంగారెడ్డిగారు ఇదే స్థానంలో కూర్చున్నారు, వెంకటసుబ్బయ్యగారు, ముఖషిర్‌షా గారు, గొట్టిపాటి బ్రహ్మయ్యగారు తదితర అనేక మంది పెద్దలు ఈ స్థానం నుంచే మంచి విలువలు నేర్పిన ఘటనలున్నాయి. మాడపాటి హనుమంతరావుగారు కూడా ఈ స్థానంలో కూర్చున్నవారిలో వున్నారు. మేము అప్పుడు బళ్లో చదువుకుంటున్న రోజులు . వారందరినీ గుర్తు చేస్తూ మమ్మల్నందరినీ నడుప వలసిన స్థానంలో నేడు మీరున్నారు. ఈ సభను ఏర్పాటు చేయడానికి ముఖ్య కారకులు పెద్దలు రాజశేఖర్‌రెడ్డిగారు. గతంలో ఈ కౌన్సిల్ రద్దు కావడంలో పెద్ద భాగస్వామి పెద్దలు రోశయ్యగారే (సభలో నవ్వులు) . ఈయన మాటలు ధోరణి, ఈయన ప్రశ్నిస్తున్న పరిస్థితికి, ఇక లాభం లేదనుకుని ఆనాడు ప్రభుత్వంలో వున్న వాళ్లు రద్దు చేశారు. అప్పుడు టీచర్స్ నుంచి కూడా ప్రతినిధులున్నారు . మేమంతా అసలు ఈ టీచర్స్ లేకుంటే బాగుండేదని అనుకునే వాళ్లం . ఆనాడు బాలకృష్ణంగారు, మాణిక్యరావుగారు కూడా వున్నారు. ప్రతి విషయం మీద చెప్పలేనంతంగా, చాల విపరీతంగా చర్చ జరిగేది. ఇప్పుడు గవర్నర్‌గా వున్న రామారావుగారు కూడా ఆనాడు సభలో వున్నారు. అందరూ ఎంతో ఉన్నతంగా వుండేవారు. ముఖ్యంగా ఈ సభ తిరిగి వచ్చినందుకు వారందరికీ మనం నమస్కారాలు తెలియజేయవలసిన అవసరం వుంది. టీచర్స్, గ్రాడ్యుయేట్స్, లోకల్ బాడీస్ నుంచి ఈరోజు కూడా రెప్రజెంటేషన్ వుంది. ముఖ్యమంత్రిగారు మూడు సంవత్సరాల క్రితం కౌన్సిల్ గురించి ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పడమే గాకుండా దాని ఏర్పాటుకు చాలా కృషి చేశారు. ప్రతి నిత్యమూ కౌన్సిల్ రాదని, ఎంఎల్‌సి కాలేమనే అనుకునే వాళ్లం . అటువంటి తరుణంలో ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డిగారు ఈ సభను ఏర్పాటు చేయడంలో చాలా పెద్ద రోల్ ప్లే చేశారు. ముఖ్యంగా మేము పార్లమెంటులో పైనుంచి( గ్యాలరీ) చూస్తూ, ఈ కౌన్సిల్ బిల్లు పాస్ అవుతుందా లేక మళ్లీ ఏదైనా ప్రమాదంలో పడుతుందా అని భయం భయంగా అనుకునే వాళ్లం, మాతోబాటు ప్రస్తుత సభాధ్యక్షుల వారు, కేశవరావుగారు తదితరులు గ్యాలరీలో వున్నారు. పెద్దలు పువ్వాడ నాగేశ్వరరావుగారు చెప్పినట్లు చివరికి అన్ని పార్టీల సహకారంతో ఈ బిల్లు పాస్ అయింది. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. నాకు ఒక అనుమానం వుంది. అది ఈ సభలో నివృత్తి కావాలి. ఇక్కడ సభాపతిని ఛైర్మన్‌గారని అంటున్నాం, అధ్యక్షుల వారని అంటున్నాం, ఛైర్మన్ అంటే తెలుగులో అర్థమేమిటో నాకు తెలియడం లేదు. అక్కడ సభాపతిని స్పీకర్‌గారని అంటున్నాం, అధ్యక్షులని కూడా అంటున్నాం . ఈ రెండు పదాలకు తేడా ఉందా? లేదా అన్న అనుమానం నాకుంది. నేను చాలా మందిని అడిగాను,కానీ సరైన సమాధానం రాలేదు. ఛైర్మన్ అనే పదానికి తెలుగులో అర్థం ఏమిటి? (సభలో నవ్వులు ) .... ఇక్కడ ఒక విషయం మనవి చేయాలి. నెహ్రూగారుండగా, అసలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ఈ దేశాన్ని నడిపే స్థానం ఎటువంటిదనే సమస్య వచ్చినపుడు పార్లమెంటులో నెహ్రూగారు ఏరకమైన ఇబ్బంది లేకుండా ఖచ్చితంగా పార్లమెంటు/లెజిస్లేచరే సుప్రీం అనే మాట చెప్పడం జరిగింది. కాని ఈరోజు అసెంబ్లీలో గానీ, పార్లమెంటులో గానీ జరుగుతున్న పరిస్థితులను చూస్తే అసలు ఈ భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యముందా అనిపిస్తోంది. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో చట్టసభలకు అస్సలు గౌరవం కనబడడం లేదు. ఈ స్థితిని చూసి ఇప్పుడున్న లోక్‌సభ స్పీకర్‌గారు కూడా తన ఆవేదనను తెలియజేయడం జరిగింది. మనకు స్థాయి వుంటే, ధైర్యం వుంటే ఉన్న చోటి నుంచే మాట్లాడవలసిన అవసరం వుంది. మనకు స్థాయి లేనపుడు భుజాలు, చేతులు తడుముకోవలసి వస్తుంది. ఇది బాక్సింగ్ ఏరియా కాదు. మన ఆందోళన, ఆవేదనను వ్యక్తం చేస్తూ ప్రజా సమస్యల మీద మాట్లాడవలసిన అవసరం వుంది. దాన్ని కాదని ఎవరికి వారు వెల్‌లోకి వెళ్లడమనేది, అసెంబ్లీలోగానీ, పార్లమెంటులో గానీ, అది ప్రజాస్వామ్యాన్ని మంటగలిపే చర్య మాత్రమేనని మనవి చేస్తున్నాను. ఇప్పుడున్న పరిస్థితుల్లో ముషారఫ్ లాంటి వ్యక్తి సీట్లలో వుంటే ప్రమాదం

ముంచుకొచ్చే పరిస్థితి వుంది. ఈ పరిస్థితికి ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులే కారణమవుతారు. నాకు చాలా భయంగా వుంది ఆ విషయంలో . ఈరోజు జరుగుతున్న పరిస్థితులను చూస్తే, పార్లమెంటులో గానీ అసెంబ్లీలో గానీ, ఎందుకు సభ్యులు వెల్‌లోకి పోతున్నారు, ఎందుకు వాళ్లు భుజాలు భుజాలు తడుముకుంటున్నారో నాకు అర్థం కావడం లేదు.

అధ్యక్షా, నేను మొట్టమొదటిసారిగా ఎంఎల్‌సిగా వచ్చినపుడు సి.వి.కె. రావుగారిని ఒక సలహా అడిగాను . ప్రజాస్వామ్యంలో మా రోల్ ఏమిటని వారిని అడిగాను. ఐసిఎస్ చదువుకున్న వ్యక్తి, ఐదు సార్లు ఇండిపెండెంటుగా ఎన్నికైన మేధావి ఆయన . ఆయన ఏమి చెప్పారంటే – Assembly is not a court. కోర్టులో అప్పటికిప్పుడే జడ్జిమెంటు కావాలని, నాకు న్యాయం చేయాలని , కోర్టులో వాదించడానికి ఇద్దరు న్యాయవాదులకు అవకాశం వుంది. కాని అసెంబ్లీలో మాత్రం మాదే న్యాయం, మీరు మాట్లాడడానికి వీలులేదు, అప్పటికప్పుడు జడ్జిమెంటు కావాలని అడిగే ఆస్కారం లేదు, మీరు మాగ్జిమమ్ చేయగలిగింది ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ఎన్‌లైటెన్ చేయడం, ప్రజలకు తెలియజేయడం . ప్రభుత్వం వారి ఇష్టం, ఏ రకంగా చేసుకుంటే ఆ రకంగా చేసుకోవచ్చు . ప్రజలు మళ్లీ తిరిగి ప్రభుత్వాన్ని ఎన్నుకునే పరిస్థితి వుంది కాబట్టి అంతకు మించి చేయడం, జడ్జిమెంటు ఇప్పుడే రావాలని కోరడం తప్పని పెద్దలు సి.వి.కె. రావుగారు స్పష్టం చేశారు. నిజంగా నేను చాలా మంచి అడ్వయిజ్ తీసుకున్నానని అనుకున్నాను. ఆరోజు నుంచి నేను పదహారు సంవత్సరాలు లెజిస్లేచర్‌లో ఉన్నా ఏనాడూ నేను ఆయన చెప్పిన దాన్ని మించి మాట్లాడలేదు.

అధ్యక్షా, need of the Council గురించి చర్చ చేశారు. ఎవరు చర్చ చేశారంటే, మళ్లీ కౌన్సిల్‌లో మెంబర్‌షిప్ కావాలని అనుకున్నవారు, ఈ మెంబర్‌షిప్ కోసం తాపత్రయ పడిన వారు, కోటరీగా కూర్చున్న పెద్దలే మళ్లీ ఈ కౌన్సిల్ ఏమిటి? కౌన్సిల్ ఎందుకు అని మాట్లాడడం జరిగింది. కౌన్సిల్ ఎందుకనే విషయం తెలియని రాజకీయ పక్షాల గురించి ఏమీ చెప్పనవసరం లేదు. కౌన్సిల్ అన్నది రాజ్యాంగబద్ధంగా ఉన్నది , ఏనాడైతే రాజ్యాంగం రాసుకున్నామో ఆనాడే రాసుకున్నాం కౌన్సిల్ కావాలని.
ఉ.11.00

మనం జిల్లాపరిషత్తు కావాలంటే మండలి వద్దని కాదు. అదే విధంగా డిడిఆర్‌సి ఉంది. ప్రతిచోట ఉండే ప్రజలకు స్పందన తెలియచేయడం కోసం వేరు వేరు అంగాలు క్రియేట్ చేయడం జరిగింది. ఆ విధంగా కౌన్సిల్ వచ్చింది తప్ప ఎవరినో విమర్శించడానికి కాదు. మరల మేము వస్తే మండలి రద్దు చేస్తామని వారు అనడం పగటి కల. వారు వచ్చేది లేదు, రద్దు చేసేది లేదు. ఇటువంటి మాటలు గౌరవప్రదం కాదు. ఈ సభ కావాలని చెప్పి 20 సంవత్సరాల తరువాత ముఖ్యమంత్రిగారు లీడ్ తీసుకొని దేశంలోని రాజకీయ పార్టీల సహకారం తీసుకొని ఏర్పాటు చేసిన తరువాత, రేపు వచ్చి ఏదో చేస్తామంటే ఎవరిని బెదిరించడానికి? ఎన్నికైన సభ్యులను చిన్న వారిని చేయడానికి తప్ప ఇంకొకటి కాదు. మీరు ఈ స్థానాన్ని అలంకరించిన సందర్భంగా , మా సభ్యులందరిని అన్ని పార్టీల వారిని కోరేది స్థానాల నుండి కదలవలసిన అవసరం లేదు. ఇది గుర్తుంచుకొని మన సమస్యను తెలియచేయడం కోసం మార్గం మాత్రమే ఎంచుకోవలసిన అవసరం ఉంది. మన గౌరవాన్ని పెంచుకుంటే తప్ప ప్రజలు మనలను హర్షించరు.

శ్రీ డి. శ్రీనివాస్‌: నేను అధ్యక్షా అని సంభోధిస్తాను. ఛైర్మన్ సర్, మా వెంకటరెడ్డిగారు లేని పంచాయితీ పెట్టాడు. అధ్యక్షా, కౌన్సిల్ ఫార్మ్ కావడం ఎంత ఆనందంగా ఉందో మిమ్ములను అక్కడ చూడడం

కూడా అంతే ఆనందంగా ఉంది. కౌన్సిల్ ఫార్మ్ అయినందున , మీరందరూ రాగలిగారు. మాముఖ్యమంత్రి గారు, లెజిస్లేటివ్ మినిస్టరుగారు బాగా ఆలోచన చేసి అసెంబ్లీ కంటే చక్కని సీట్లను ఏర్పాటు చేశారు. దానికి కూడా ఆనందంగా ఉంది. ఎందుకంటే రోశయ్యగారు అక్కడ గంటల తరబడి కూర్చునే పరిస్థితిలో లేరు. ఇవి చాలా బాగా (సీట్లను ఉద్దేశించి) ఉన్నాయి. కౌన్సిల్‌లో ఉన్న పెద్దలందరినీ చూస్తుంటే తలపండిన వారు తక్కువ ఉన్నా, మేధావులు, రాజకీయ విశ్లేషకులు ఎక్కువగా ఉన్నారు. ఈ రాష్ట్రం యొక్క పురోగతికి దోహదపడే వారు చాలామంది యువకులు అయినప్పటికీ నిష్పక్షపాతంగా ఆలోచన చేసి రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే సూచనలు ఇచ్చే వ్యక్తులు చాలా మంది అన్ని పార్టీలలో కనపడుతున్నారు. నేను ఇప్పుడు పేర్లు చెప్పదలచుకో లేదు. వాస్తవంగా చిన్న వయస్సులో ఉన్న వారు చాలా తెలివైన వారు కూడా ఉన్నారు. అక్కడ అసెంబ్లీలో జరిగే పరిస్థితి చూసి, కౌన్సిల్‌లో ఏమి జరుగుతుందోననే దానిని నేను డిస్కస్ చేయదలచుకోలేదు. అసెంబ్లీలో ఏమి జరుగుతుందో యావత్ ప్రపంచం చూస్తూ ఉంది. దయచేసి ఈ రోజు ఈ రాష్ట్రంలో ఈ హౌస్ ఒక చక్కని సాంప్రదాయాన్ని నెలకొల్పి , మిమ్ములను చూసి మేము బుద్ధి తెచ్చుకునే విధంగా చేస్తారని నాకు ఉంది. ఇక్కడా అదే జరిగితే ప్రజాస్వామ్యానికి విలువే ఉండదేమో. ఆడ గొడవలు చేసే వారు చాలా తక్కువ మంది కన పడుతున్నారు. గోవర్ధన్ రెడ్డి అక్కడ ఉండవలసింది. ఎన్నికల కంటే ముందు నుండే రాజశేఖర్ రెడ్డి గారు సిఎల్‌పి లీడర్‌గా, నేను పార్టీ అధ్యక్షునిగా ఉన్నప్పుడు ఖచ్చితంగా కౌన్సిల్‌ను ఏర్పాటు చేస్తామని నిర్ణయం చేసి మ్యానిఫెస్టోలో పెట్టిన తరువాత కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వస్తే రాజశేఖర్ రెడ్డిగారు ముఖ్య మంత్రి అవుతారని ఎలా అనుకున్నారో, కౌన్సిల్ వస్తే చక్రపాణిగారు ఛైర్మన్‌గా అవుతారని అలా అనుకు న్నాము. కాబట్టి రెండు వాస్తవాలు అయ్యాయి. తీసివేయడానికి 30 రోజులు పడితే, తేవడానికి మూడు సంవత్సరాలు పట్టింది. జరగవలసిందే జరిగింది. గ్రాడ్యుయేట్సు కానిస్టిట్యుయెన్సీల నుండి, టీచర్సు కానిస్టి ట్యుయెన్సీల నుండి ప్రజలు చాలా చక్కటి వారిని ప్రతినిధులుగా ఎన్నుకున్నారు. ఏ పార్టీ వారైనా నాకు సంబంధం లేదు. రాజకీయ విశ్లేషకులు వచ్చారు. డిమాండ్ చేయని వారు కూడా గెలిచారు. డిమాండ్ చేయని వారంటే చేతకాని వారని కాదు. ఈ రోజు ఎన్నికలలో జరుగుతున్న అల్లరి మనందరికీ తెలుసు. ప్రజలు ఎక్కడ, ఎవరు అవసరమనుకుంటే ప్రజలు వారి విచక్షణా జ్ఞానంతో వారినే గెలిపించారని రాజకీయ నాయకులు అర్థం చేసుకోవాలి. ఈ రాష్ట్రానికి కౌన్సిల్ అవసరమా లేదా అనే దాని గురించి నేను మాట్లాడడం సబబుగా ఉండదు. మా పార్టీ మా నాయకత్వం ఈ సభ ఖచ్చితంగా అవసరమనే భావనతో తీసుకురావడం జరిగింది. కనుక నాకు పూర్తి విశ్వాసం ఉంది. ఈ రోజు కౌన్సిల్‌లో ఉన్న సభ్యులందరూ వివిధ ఇష్యూస్‌పైన చర్చించడం ద్వారా, లోతుగా విషయాన్ని చర్చించడం ద్వారా వారిచ్చే సూచనలను మేము పట్టించుకునే అవసరం ఉంది. దురదృష్టం ఏమిటంటే ఈ రోజుఫైనాన్సు బిల్లులు కూడా అల్లర్లలో పాస్ చేసే పరిస్థితి ఏర్పడింది. స్టాట్యుటరీ బిల్సు, గవర్నమెంట్ బిల్సు, ఫిస్కల్ బిల్స్ మొదలైనవి ఏ పార్టీ ప్రభుత్వంలో ఉన్నా ఇతర పార్టీల వారు సహకరించ వలసిన అవసరం ఉంది. కనుక మీ యొక్క వ్యవహారంతో , వ్యవహార శైలితో తలపండిన వారితోబాటు తెలివైన వారు కంట్రిబ్యూట్ చేయగల శక్తి ఉన్న వారిని ప్రజలు ఇక్కడికి పంపించారు. కాబట్టి హౌస్ ఆఫ్ ఎల్డర్స్ అనే మాట ఏదైతే ఉందో , పెద్దల సభ అనే దానికి మీరు కూడా వ్యవహారం చేసి ఈ యొక్క రాష్ట్రంలో కౌన్సిల్ అవ సరం ఏమిటనేది నేర్పించవలసిన బాధ్యత మీపై ఉంది. మీ యొక్క కంట్రిబ్యూషన్స్ ద్వారా కౌన్సిల్ రావడం జరిగింది. రాజశేఖర్ రెడ్డిగారి నాయకత్వంలో కాంగ్రెసు పార్టీ, కాంగ్రెసు అధిష్టానం కాని ఒక సవ్యమైన నిర్ణ యాన్ని తీసుకుందని రుజువు చేసుకునే అవసరం ఉంది. దీనిలో రాజకీయం అని కాకుండా ప్రతి సభ్యుడు కూడా బాధ్యతతో వ్యవహారం చేయాలి. పార్టీలు, పార్టీ కార్యక్రమాలు, పార్టీ డైరెక్షన్సు ఉంటాయి. కాని హౌస్ ఆఫ్ ఎల్డర్స్‌లో మాత్రం ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలి. ఆ రకంగా వ్యవహారం చేస్తే బాగుంటుంది. మీరు చాలా ఎక్స్‌పీరియెన్సు ఉన్న వ్యక్తి, మేధావులు , అడ్వకేటుగా పనిచేసిన వారు, మీ యొక్క వృత్తిని త్యాగం

చేసి పార్టీకి సేవ చేసిన వారు చాలా అనుభవం ఉన్న వారు కనుక మీదైన శైలిలో ఈ సభను నడిపించే కెపాసిటీ మీకు ఉంది. కనుక హృదయ పూర్వకంగా మిమ్ములను అభినందిస్తూ , మీకు ఆయురారోగ్యాలు ఇవ్వాలని కోరుకుంటూ, సభ్యులందరినీ హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. ఇది కేవలం మన అకామడేషన్ కొరకని కాకుండా ప్రజల కొరకు సేవచేసే అవకాశాన్ని ప్రజలు మనకు ఇచ్చారు. ఈ హౌస్ శాంక్టిటీని కాపాడితే మనం దేశానికి, రాష్ట్రానికి మేలు చేయడంలో దోహదపడతాము. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాహిత కార్యక్రమాలు సజావుగా కొనసాగడానికి మీ యొక్క పూర్తి సహకారాన్ని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.
ఉ.11.10

శ్రీ పల్లె రఘునాథరెడ్డి :(అనంతపూర్) అధ్యక్షా, అత్యంత ప్రతిష్టాత్మకమైన, అత్యున్నతమైన ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్‌కు తమరు ఏకగ్రీవంగా ఛైర్మన్‌గా ఎన్నికైనందుకు తెలుగుదేశం పార్టీ తరపున హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. బలహీనవర్గాల ప్రతినిధి అయిన మీరు కర్నూలు జిల్లాలో అతి సాధారణమైన కుటుంబములో జన్మించి, తమరి కృషి, పట్టుదల, కర్తవ్య పరాయణత, దీక్షా దక్షతలు, నిజాయితీ, చిత్తశుద్ధితో అహర్నిశలూ కృషి చేశారు. రాజకీయ రంగములో అంచెలంచెలుగా ఎదిగారు. అత్యున్నతమైన శిఖరాలు అధిరోహించారు. చివరకు ఈ ప్రతిష్టాత్మకమైన విధాన పరిషత్‌కే ఛైర్మన్ కాగలిగారు.

అధ్యక్షా, మీరు చిన్నప్పటి నుండి విద్యార్థి నాయకుడిగా, సాంఘిక సేవా తత్పరాయణుడిగా, ఆంధ్రపదేశ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఛైర్మన్‌గా, న్యాయవాదిగా, మండలి సభ్యుడిగా, ఈ మండలి వైస్-ఛైర్మన్‌గా, ఈ మండలి యాక్టింగ్ ఛైర్మన్‌గా ఏ పని చేపట్టినా చాలా చక్కగా తమరు విధులు నిర్వహించారు. అత్యంత ప్రతిభా శక్తి సామర్థ్యాలతో మీ ప్రతిభను చాటుకున్నారు. అన్ని విధాలుగా మీరు చేపట్టిన పదవులన్నింటికీ కూడా వన్నె తెచ్చారని చెప్పి మనవిజేస్తున్నాను. అంతేగాకుండా ఈ సభకు చాలా విశిష్టమైన స్థానం, గొప్పదనం వుందని పెద్దలు గతంలో చెప్పారు. గతంలో మాడపాటి హనుమంతరావు గారు గాని, గొట్టిపాటి బ్రహ్మయ్య గారు గాని, పిడతల రంగారెడ్డి గారు వంటి హేమాహేమీలు, ఉద్దండులు ఈ సభను ఎంతో చాకచక్యంగా మండలి ఛైర్మన్‌లుగా వ్యవహరించారు. ఈ మండలి యొక్క గౌరవాన్ని, ఔన్నత్యాన్ని దేశమంతా చాటిచెప్పారని చెప్పి ఇంతకు ముందు చెప్పిన వక్తలు చెప్పారు. తమరు కూడా అదే కోవలో ప్రయాణించి, పార్టీలకు అతీతంగా వ్యవహరించి ఈ మేధావుల సభకు అన్ని విధాలుగా గౌరవాన్ని, ప్రతిపత్తిని కలిగించే విధంగా వ్యవహరిస్తారని ఆశిస్తూ, దేశంలోనే ఈ విధానసభను ఆదర్శవంతమైన, అర్థవంతమైన గౌరప్రదమైన సభగా తీర్చిదిద్దాలని ఆశిస్తున్నాము. దీనికిగాను తెలుగుదేశం పార్టీ తరపున సకల సంపూర్ణ సహాయ,సహకారాలు అందజేస్తామని తెలియజేస్తూ, ఈ శుభ సందర్భములో మహాకవి, మహనీయుడైన కబీర్‌దాస్ చెప్పిన శ్లోకాన్ని ఉదహరిస్తాను.

పేఢ్ ఫల్ నహీ ఖాతీహై
సర్‌వర్ పియా నహీనా పానీ
కర్ నహీ నహీ సంపదా సుజా

సరోవరం తన నీటిని తాను త్రాగదు, సకల జీవరాశులకూ ఉపయోగపడుతుంది, ఆ ప్రాణులను కాపాడుతుంది. వృక్షం తను కాచిన ఫలాలను తాను తినదు, భక్షించదు. సకల జీవరాశుల క్షుద్బాధను, ఆకలి బాధను తీరుస్తుంది. అదే విధంగా సమర్థవంతుడు, ప్రతిభావంతుడైన నాయకుడు తన సేవను, తన శక్తిని, తన సామర్థ్యాన్ని సమాజానికి ఉపయోగిస్తాడని చెప్పి ఆ మహనీయుడు చెప్పాడు. ఇంతకు ముందు చెప్పారు

తమ శక్తి, సామర్థ్యాల గురించి. మీ శక్తిని, మీ సామర్థ్యాన్ని, మీ ప్రతిభను ఆంధ్రప్రదేశ్‌లో కోట్లాదిమంది పీడిత, తాడిత ప్రజానీకం, బడుగు, బలహీనవర్గాల వారు వున్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా ఈ చట్టసభలు రూపకల్పన చేసే దానికి అన్ని విధాలుగా మీరు కృషి చేస్తారని ఆశిస్తున్నాను. ఈ సభలో కూడా చాలామంది చెప్పినట్లు, మంత్రి శ్రీనివాస్ గారు చెప్పినట్లు అనుభవజ్ఞులు, కొత్తవారి కలయికతో వచ్చాము. విద్యావైజ్ఞానికులుగా, రాజకీయ విశ్లేషకులు, రాజకీయ నాయకులు మంచి అనుభవంతో వచ్చినవారు వున్నారు.

ఇక్కడ కూడా సభ తరఫున '' రాముని బాణం కంటే, కృష్ణుని సుదర్శన చక్రం కంటే, ఈశ్వరుని పాశుపాతాస్త్రం కంటే కూడా అత్యంత శక్తివంతమైనది ఒక మంచి మాట, మంచి ఆలోచన, మంచి భావన ''. మేమంతా అదే మంచి భావం, ఆలోచనతో ఈ సభకు వచ్చామని, తప్పకుండా మీకు అన్ని విధాలుగా సహకరిస్తామని చెప్పి ఈ సభాముఖంగా తెలియజేస్తూ, ఈ సభ విజయవంతముగా నడిపేందుకు కావలసిన ధైర్యాన్ని, స్థైర్యాన్ని, శక్తి సామర్థ్యాలన్నీ ఆ భగవంతుడు మీకు ప్రసాదించాలని చెప్పి హృదయపూర్వకంగా కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ యన్. శేషారెడ్డి (ఈస్ట్ అండ్ వెస్ట్ గోదావరి) అధ్యక్షా, ఆనాటి భారత రాజ్యాంగ నిపుణులు ఎంతో ఆలోచించి ఈ విధానసభను ఏర్పాటు చేయడం జరిగింది. కారణాలు ఏమైనా విధానసభ రద్దయ్యి, మేధావుల ఆలోచనలకుగాని, మేధావుల అభిప్రాయాలకు గాని దూరంగా వుండడం జరిగింది మన భారత రాజ్యాంగం ప్రకారం. అయితే మరలా రాజశేఖరరెడ్డి గారి, కాంగ్రెస్ పార్టీ యొక్క అకుంఠిత దీక్ష, పట్టుదలతో ఈ విధాన పరిషత్ రావడం జరిగింది. ఇందులో ఇప్పుడు పెద్దలు చెప్పినట్లుగా కులానికి, మతానికి, ప్రాంతీయానికి, సంఘాలకు అతీతంగా ఎంతోమంది మేధావులు ఎన్నుకోబడ్డారు. అందుకు ఉదాహరణ డా. నాగేశ్వరరావు గారు గాని, చుక్కా రామయ్య గారు గాని ఇటువంటి మేధావులు రావడం ఎంతో ఆనందకర విషయం. అయితే ఈనాడు ఇక్కడకు వచ్చిన వారిలో నాలాంటి కొత్తవారు వున్నాము కాబట్టి తప్పనిసరిగా మాకు ఒక ప్రత్యేకమైన ట్రయినింగ్ గాని, లేదా మేము ఏ విధంగా ప్రవర్తించాలనే విషయాల మీద గాని ఒక ట్రయినింగ్ ఇస్తే బాగుంటుందనే ఒక అభిప్రాయాన్ని మీ ముందు వుంచుతున్నాము. అదే విధంగా కొంతమంది చెప్పినట్లుగా ఉపాధ్యాయ ప్రతినిధులం చాలా మందిమి వున్నాము. మాకు పాఠాలు చెప్పడం బాగా అలవాటు. పాఠాలు చెప్పడమే కాదు, అవసరమయితే వింటాము. అదే విధంగా ఈనాడు ఈ విధాన సభ అనేది తప్పనిసరిగా ఈయొక్క రాష్ట్రములో మంచి పేరు,ప్రఖ్యాతులు సంపాదించి, ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా వుండేలాగ మీకు పూర్తి సహకారాన్ని అందిస్తూ రాష్ట్రాభివృద్ధిలో ముఖ్యంగా విద్యా అభివృద్ధిలో మేము ప్రముఖ పాత్ర తీసుకుంటామని చెప్పి తెలియజేసుకుంటూ, మీ అందరికీ నమస్కారాలు తెలియజేసుకుంటున్నాను.

డా.కె. నాగేశ్వర్ :(మహబూబ్‌నగర్, ఆర్.ఆర్. అండ్ హైదరాబాదు) అధ్యక్షా పెద్దలు, గౌరవనీయులు మీరు శాసన మండలిలో పనిచేసే సమయంలో శాసన మండలికి ఓటరును కూడా కాదు నేను. అందువల్ల మీలాంటి వారి నాయకత్వంలో పనిచేసే అవకాశం లభించినందుకు నిజంగా గర్విస్తున్నాము. ఖచ్చితంగా మీరు ఆశించిన రీతిలో ఈ సభను నడిపించే విషయంలో యువకులుగా మావంతు కర్తవ్యాన్ని ఇస్తాము. ఈ సభలో నిన్నటి నుండి చూస్తున్నాము, చాలా తలపండిన పెద్దలు వున్నారు. వారి గైడెన్స్‌లో మేము కూడా ఎదుగుతామని చాలా ఆనందం వేస్తుంది, సంతోషం వేసింది, ఎందుకంటే పెద్దలు చాలామంది ప్రస్తావించారు. పుచ్చలపల్లి సుందరయ్య, వావిలాల గోపాలకృష్ణయ్య, తెన్నేటి విశ్వనాథం లాంటి మహనీయులు సృష్టించిన పార్లమెంటరీ సాంప్రదాయాలకు దీటుగా ఎదుగుతామని ఆనందం వేస్తుంది, కాని కాస్తంత భయం కూడా వేస్తుంది.

ఎందుకంటే తలపండిన వాళ్లే పండించుకుంటారేమో, మా తలలు పండకుండా అడ్డుపడతారేమో అని. ఆ భయం లేకుండా మాకు అవకాశాన్ని ఇవ్వండి. ఎందుకంటే పెద్దలు, సీనియర్స్ చాలామంది వున్నారు. వారి గైడెన్స్‌లో ప్రజా సమస్యలను చర్చించే వేదికలుగా శాసన మండలిని మనం తయారు చేద్దాము. మేము ఎన్నికల ప్రచార సమయంలో కూడా చూశాము. చట్టసభల పనితీరు పట్ల పెద్దలు రోశయ్య గారు చెప్పారు. తీవ్ర ఆవేదన, ఆందోళన ప్రజలలో వుంది. వాస్తవంగా ఏ సభను ఉద్దేశించి నేను ఈ మాట అనడం లేదు. సభా సాంప్రదాయాన్ని భారత రాజకీయ వ్యవస్థలో, భారత పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థలో పతనమవుతున్న సభా సాంప్రదాయాల పట్ల ఆవేదనతో అంటున్నాము. ఒక చట్టసభను చూసి వచ్చిన తరువాత స్కూలు పిల్లలను విలేఖరులు ఎలా వుందనిపించిందని అడుగుతారు. మా స్కూలులో అయితే మా పి.టి. సార్ ఇలా బిహేవ్ చేస్తే కాళ్లు విరగ్గొడతారని అన్నారు వాళ్లు. ఇది పత్రికలలో వచ్చింది. ఇది ఏ సభను ఉద్దేశించకపోయినా మన ఆవేదనకు ఇది నిదర్శనం. ప్రజలు గర్వించేలాంటి సభగా దీనిని తీర్చిదిద్దుదాం. ప్రజా సమస్యలను లోతుగా అధ్యయనం చేసి, పరిశోధన జరిపి సమగ్ర సమాచారంతో ప్రజా సమస్యలను పరిష్కరించే వేదికగా శాసన మండలిని తీర్చిదిద్దుదాము. ఆ రకంగా మీ నాయకత్వాన ఆ కృషిలో మావంతు కర్తవ్యాన్ని తప్పనిసరిగా నిర్వర్తిస్తాము. దయచేసి మా రిక్వెస్ట్ ఇంకొకటి కూడా వుంది. ఏమిటంటే సభా సమయం విలువైనది. సభా సమయం తక్కువగా వుంది. తక్కువ సమయం అతి ఎక్కువ విలువ వున్నప్పుడు దానిని అతి తక్కువగా వినియోగించుకోవడం వల్ల ఎక్కువ ప్రయోజనం వుంటుంది. బంగారాన్ని అతి కొద్దిగా కొంటాము. ఇనుము అతి ఎక్కువగా కొంటాము. బంగారం లాంటి సభా సమయాన్ని అతి తక్కువగా వినియోగించుకోవడంలో కూడా మనం తర్ఫీదు పొందవలసిన అవసరం వుంది. ప్రతి మాటా ఒక విశ్లేషణగా, ప్రతి పదం ఒక పరిష్కారంగా శాసన మండలి సభ్యుడు కనుక ప్రసంగించగలిగితే సభా సమయం కాపాడబడుతుంది. ప్రజలు ఎన్నుకున్నటువంటి ప్రజా ప్రతినిధులుగా మనం మన బాధ్యతలను నిర్వర్తించగలుగుతాము. సభా సాంప్రదాయాలు, సభా పరిణితి కూడా పెద్దలు వివరించారు. 1950,60లో ఒక ప్రతిపక్ష సభ్యుడు మాట్లాడుతుంటే అధికారపార్టీ సభ్యుడు అదంతా విని, అయిపోయాక లేచి గౌరవ ప్రతిపక్ష సభ్యుడు మాట్లాడిన దానితో నేను విభేదిస్తున్నాను. కాని ఆయనకు మాట్లాడే హక్కు వుందని అంగీకరిస్తున్నాను. ఇప్పుడేమి అయిందంటే ప్రతిపక్ష సభ్యుడు మాట్లాడడానికి లేచినప్పుడే అధికార పార్టీ సభ్యుడు లేచి గౌరవ ప్రతిపక్ష సభ్యుడి అభిప్రాయంతో నేను విబేదిస్తున్నాను. అందుకని ఆయనకు మాట్లాడే హక్కు లేదని ప్రకటిస్తున్నాను.

ఉ. 11.20

మన పార్లమెంటరీ సాంప్రదాయాలు పడి పోతున్నాయి. పార్లమెంటరీ సాంప్రదాయాలను మరింతగా మీ నాయకత్వంలో నిలపాలని కోరుతున్నాను. మా లాంటి యువకులమంతా ఈ సభా సాంప్రదాయాలకు, సభా మర్యాదలకు కృషి చేస్తాము. ప్రజలు నిరంతరం ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చెయ్యాలని నా కోరిక. ఎం.ఎల్.సి అంటే ఉదయాన్నే తీర్మానం పై మాట్లాడాలంటే రాత్రి ఒంటి గంట వరకూ ఇంటర్నెట్‌లో బ్రౌజ్ చేస్తూ, పుస్తకాలను అధ్యయనం చేస్తూ సమగ్రమైన పరిశోధనా సమాచారంతో మాట్లాడాలి. ఊకదంపుడు ప్రసంగాలకు సభలు వేదిక కాకూడదు, ఆ రకంగా జరిగితే ప్రజలు మనల్ని క్షమించరు. శాసన మండలిని రద్దు చెయ్యాలని ఎవరైనా ప్రయత్నిస్తే వద్దని లక్షల మంది అనే స్థాయిలో శాసనమండలి చర్చలు ఎదగగలిగితే ఖచ్చితంగా ప్రజలు ఆహ్వానిస్తారని, ఆ రకంగా కృషి చేస్తామని మనవి చేస్తున్నాను. మీ నాయకత్వంలో మా లాంటి యువకులకు అవకాశాన్ని ఇచ్చి సభా చర్చలతో పెద్దల గైడెన్స్‌తో మమ్మల్ని కూడా మంచి పార్లమెంటేరియన్స్‌గా తీర్చిదిద్దాలని, ప్రజలు, పట్టభద్రులు మా పై పెట్టిన ఆశలను ప్రజల ఎదురుగా మేము

తీరుస్తామని హామి ఇస్తూ నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు కృతజ్ఞతలు తెలియజేస్తూ సెలవుతీసుకుంటున్నాను.

శ్రీ బి. మోహన్‌రెడ్డి:(మెదక్, నిజమాబాద్, అదిలాబాద్ అండ్ కరీంనగర్) అధ్యక్షా, ఈ కౌన్సిల్‌కు మీరు ఛైర్మన్ కావడం మాకు చాలా సంతోషంగా ఉంది. ఎందుకంటే, శాసన మండలి ఏర్పాటులో ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి గారు ఎంతో కృషి చేశారు. మీరు, మేము అందరం డిల్లీ వెళ్లాము. మనం కలిసి ఆర్గ్యుమెంట్ చేసాము. మీరు చాలా సూచనలు చేశారు, అవి మరచిపోలేదు. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. మన ముఖ్యమంత్రి గారైన రాజశేఖర రెడ్డి గారి స్టైలే వేరు. వారు కౌన్సిల్ తీసుకొస్తామని చెప్పారు, ఖచ్చితంగా కౌన్సిల్ వచ్చింది. మేము ఎన్నికయ్యామున్న మాటే గాని కౌన్సిల్ పీకేస్తారని, రద్దు చేస్తారని పేపర్‌లలో వసున్నది. వారు అధికారంలోకి వస్తారో రారో తెలియదు. వచ్చిన తరువాత ఏదైనా చేసుకోమనండి. రాక ముందే పీకేస్తాము, రద్దు చేస్తామంటే మా మనసు ఎలా ఉంటుంది అధ్యక్షా? పేపర్‌లో కూడా ఇది పునరావాస కేంద్రం అని రాస్తున్నారు. ఇది ఎట్లా పునరావాస కేంద్రం? ఒకొక్కరికి ఒకొక్క చరిత్ర ఉంది. ఒకొక్కరికి ఒకొక్క అనుభవం ఉంది. నేను 26 ఏళ్ల రాష్ట్ర అధ్యక్షునిగా చేసాను. పది లక్షల ఐక్య ఉద్యోగులకు నేను నాయకత్వం వహించాను. వరుసగా 12 మంది ముఖ్యమంత్రులతో సావాసం చేసాను. ఇప్పుడు పెద్దలు రాజశేఖర రెడ్డి గారితో సావాసం చేస్తున్నాను. వారి పరిపాలనలో మీరు ఇక్కడ శాసనమండలికి ఛైర్మన్‌గా అయ్యారంటే ఈ రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని నేను అనుకుంటున్నాను. ముఖ్యంగా వారి ముఖం చూస్తే ఎంతో గౌరవంగా అనిపిస్తుంది. శాసనమండలి అధ్యక్షుడు ముఖంతో సగం కంట్రోల్ చేస్తాడనేటువంటి మాట మీ ద్వారా మాకు కనబడుతుందని మీ దృష్టికి తీసుకొస్తున్నాను. 22 ఏళ్ల నాడు రద్దయి ఇప్పుడు మళ్లీ రివైవ్ అయ్యింది. గతంలో కౌన్సిల్ ఒక లాగ ఉండేది. ఆ రోజులు అయిపోయాయి. 22 ఏళ్ల తరువాత చాలా మార్పు వచ్చింది. ఖచ్చితంగా, కొన్ని మార్పులు ఇప్పుడు జరగవలసి వస్తుంది. ముఖ్యంగా విద్యారంగం అనేక చిక్కులను ఎదుర్కొంటుంది. సర్వీసు రూల్స్ లేవు, మీ ఆధ్వర్యంలో ఏకీకృత సర్వీసు రూల్స్ రావాలి. నాలుగు లక్షల మంది ఉపాధ్యాయులు కొట్టుమిట్టాడుతున్నారు. ప్రమోషన్స్ లేక అనేక మంది ఉపాధ్యాయులు రిటైర్డ్ అవుతున్నారు. అప్రంటీస్ టీచర్స్ వచ్చి చెబుతున్నారు. 12 వందల రూపాయలతో లేబర్ కూడా బ్రతకలేకపోతున్నారు. చాలా మంది ఎం.ఎ చదివి ఉంటున్నారు. ఏదైనా సరే కేంద్రం నుండి డబ్బు తీసుకురావాలని, ముఖ్యమంత్రి గారు అప్రంటీస్ విధానాన్ని రద్దు చెయ్యాలని కోరుకుంటున్నాను. ఈనాడు, జూనియర్ కాలేజీలలో లెక్చరర్స్ పోస్టులు, ప్రిన్సిపాల్ పోస్టులు అన్ని ఖాళీగా ఉంటున్నాయి. ఈ విధంగా కాలేజీలు నడుస్తున్నాయి. దీనిని ప్రైవేట్ ఇన్‌స్టిట్యూషన్స్ క్యాచ్ చేసుకుంటున్నాయి. కాబట్టి మనం దీనికి ఒక సొల్యూషన్‌ని తీసుకురావాలి అది శాసనమండలి ద్వారా జరగాలి. అప్పుడు ఖచ్చితంగా ఇది పునరావాసం అవుతుందా లేక ప్రాణం పోసిన సభ అవుతుందా అనేది ఖచ్చితంగా తేల్చాలని మీ దృష్టికి తీసుకొస్తున్నాను. మీ ఆధ్వర్యంలో శాసన మండలి సభ్యులు చేసిన సూచనలు, మంత్రులు ఆ పద్ధతులలో యాక్షన్‌కు రియాక్షన్ ఇచ్చినట్లయితే ఖచ్చితంగా సత్ఫలితాలు వస్తాయి. ఈరోజు పన్నెండు లక్షల మంది విద్యార్థులు ఎస్.ఎస్.సి పరీక్షలు రాస్తున్నారు. 5వ తేదీ నుండి టీచర్స్ బాయ్‌కాట్ చెయ్యదలచుకున్నారు. పన్నెండు లక్షల మంది విద్యార్థులంటే, 24 లక్షల మంది తల్లిదండ్రులన్నమాట. వీళ్లంతా టెన్షన్‌లో ఉన్నారు. కాబట్టి ముఖ్యమంత్రి గారు మనస్సులో పెట్టుకొని టీచర్ సంఘాలను పిలిచి, దానికి పరిష్కారం చేస్తే కథ సుఖాంతం అవుతుంది. మేము కూడా సహాయం అందిస్తామని చెప్పి మీ ద్వారా తెలియజేస్తున్నాను. ఈరోజు ఒక కోటి 31 లక్షల మంది విద్యార్థులు 'మా దగ్గర నుండి 8 మంది టీచర్స్ ఎం.ఎల్.సిలను పంపించాము, మాకు మంచి జరుగుతుంది' అనే ఆలోచనలో ఉన్నారు. దానికి మేము కూడా కట్టుబడి , మంచి ఫలితాలను తీసుకురావడానికి శాసన మండలి ద్వారా మంచి జరగడానికి

అన్ని రకాల సహాయసహకారాలు అందిస్తామని, కేవలం ఉపాధ్యాయుల కోసం లెక్చరర్స్ కోసమే కాకుండా, బీద ప్రజల కోసం పోరాడతామని మనవిచేస్తున్నాను. వారికి త్రాగడానికి మంచినీళ్లు లేవు, ఇది ఎండాకాలం. చాలా దూరం వెళ్లి మంచినీళ్లు తెచ్చుకుంటున్నారు. ఆ పరిస్థితిని మార్చాలి. వీటిపై ఆలోచించి, శాసనమండలి ద్వారా అందరి సలహాలను, సూచనలను తీసుకొని మంచి జరుగుతుందని తెలియజేస్తూ నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, మీ ఆరోగ్యం మంచిగా ఉండాలని, భగవంతుడు మమ్మల్ని మంచిగా నడిపించడానికి మీకు శక్తిని ఇవ్వాలని కోరుకుంటూ ముగిస్తున్నాను.

శ్రీ చుక్కా. రామయ్య: (వరంగల్, ఖమ్మం అండ్ నల్గొండ) అధ్యక్షా, ఈ ఏకగ్రీవ ఎన్నిక కేవలం శాసన మండలిలోనే కాకుండా రాష్ట్రంలోనే కొత్త వాతావరణం సృష్టిస్తుందని నేను ఆశిస్తున్నాను. ఈ ఎన్నిక కేవలం శాసనమండలి వరకే కాదు. రాబోయే శాసన మండలి యొక్క సలహాలకు నాంది పలుకుతుందని నేను అనుకుంటున్నాను. ఇలాంటి సుహృద్భావ వాతావరణానికి మీరు కొంత కారణమని నాకు తెలుసు. Perhaps your experience might have enabled you to get elected as Chairman. కాబట్టి మీ అపారమైన అనుభవం, ఈ రాష్ట్రం పైన మీకున్నటువంటి అభిమానం, సామాన్యమైన ప్రజలపై వున్నటువంటి అనురాగం వల్లే అత్యున్నత స్థానానికి రాగలిగారని మనవి చేస్తున్నాను. ఈ శుభ సమయంలో నేను ఉపాధ్యాయుల వైపు నుండి అభినందనలు తెలుపుతున్నాను. మేము మొదటిసారి శాసనమండలికి వచ్చాము. ఎన్నో ఆశయాలతో వచ్చాము, ఎన్నో లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని వచ్చాము. అంతేగాకుండా, సామాన్య ప్రజల యొక్క వాంఛలను మీ ముందు పెట్టాలని వచ్చాను. ఒకొక్కసారి మీరు కేటాయించిన సమయాన్ని మించిపోవచ్చు. సమయం మించిపోతుందని చూడకుండా మేము చెబుతున్నటువంటి భావాలను మీరు వీలైనంతవరకూ విని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారని మనవిచేస్తున్నాను. బీద ప్రజల యొక్క కోరికను వినిపించడానికి కూడా మీ ముందుకు వచ్చాను. మీకు అపారమైన అనుభవం ఉంది. మీరు అడ్వొకేట్, రూల్స్ అన్నీ మీకు తెలుసు. ఛైర్మన్, కేవలం రూల్స్ పాటించడమే కాకుండా he has to be a Moderator. Sometimes, he has to create a congenial atmosphere in the House. ఒక్కసారి హౌస్ టెన్షన్‌లోకి వస్తే మీ ఛలోక్తులతో, అనుభవంతో ఒక పొజిషన్‌కి తీసుకురావలసిన బాధ్యత మీ పైన ఉంది. మీరు అపారమైన అనుభవంతో సుహృద్భావ వాతావరణాన్ని ఈ హౌస్‌లో కలిగిస్తారని మనవిచేస్తున్నాను.

ఉ.11.30

ఈ సందర్భంగా నేను ఒక రిక్వెస్ట్ చేస్తున్నాను. ఈ సభకు ఉపాధ్యాయుల నియోజకవర్గం నుంచి చాలా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఎన్నికై వచ్చారు. గతంలో కొన్ని సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారు ఈ శాసనమండలికి ఎన్నికై అపారమైన సేవలు చేశారు. ఆ తోవలోనే మేం కూడా నడుస్తామని మీకు ఈ సందర్భంగా హామీ ఇస్తూ సత్సంప్రదాయాలను ఆ విధంగా నిలబెట్టుకోవడానికి పూర్తిగా మీకు సహకరిస్తామని హామీ ఇస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ షేక్ హుస్సేన్: అధ్యక్షా, మీరు ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్‌కు ఛైర్మన్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం చాలా ముదావహమైన, హర్షించదగిన విషయం. ఇరవై రెండు సంవత్సరాల క్రితం శాసన పరిషత్ రద్దుకావడం జరిగింది. ఇప్పటి గౌరవ ముఖ్యమంత్రిగారు కూడా అప్పటి శాసనపరిషత్‌లో సభ్యులు . అప్పటి శాసనపరిషత్‌కు మీరు డిప్యూటీ ఛైర్మన్‌గా ఉన్నారు. శాసనపరిషత్ యొక్క ఆవశ్యకత గురించి విస్తృతంగా, రాష్ట్ర వ్యాప్తంగా బడుగు, బలహీన వర్గాల సమస్యలను మేధావి వర్గం చర్చించి సముచితమైన నిర్ణయాలు

తీసుకోవడానికి అవకాశం కల్పిస్తూ గౌరవ ముఖ్యమంత్రిగారు, ఆయన మంత్రివర్గ సహచరులు ఈ విధాన పరిషత్‌ను పునరుద్ధరిచడం మిక్కిలి గొప్ప విషయమని నేను ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. మనకందరకు వారు ఒక అవకాశం కల్పించారు. దానిలో మీరు కూడా పాలు పంచుకున్నారు. శాసనపరిషత్ యొక్క ఆవశ్యకత గురించి వివరంగా పరిశోధించి మీరు ఒక బృహత్‌గ్రంథాన్ని రచించారు. ఆ గ్రంథంద్వారా శాసనపరిషత్ ఆవశ్యకతను నిరూపించగలిగారు. గౌరవ ముఖ్యమంత్రిగారు మాట్లాడుతూ మీరు అజాత శత్రువని అన్నారు. అధ్యక్షా, నేను మిమ్మల్ని 1983 నుంచి చూస్తున్నాను. మీతో నాకు చాలా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. మనమిద్దరమూ కలిసి బడుగు, బలహీన వర్గాలు, మైనారిటీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లే కార్యక్రమాల్లో నేను కూడా ఒక కార్యకర్తగా మీతో పాల్గొన్నటువంటి విషయం మీకు బాగా తెలుసు. అటువంటి అపారమైన అనుభవజ్ఞులైన మీరు శాసన పరిషత్‌కు ఛైర్మన్‌గా ఎన్నిక కావడం ఎంతో సంతోషకరం . మనమందరమూ కలిసి ఇక్కడ బేధ వైషమ్యాలు ఏమాత్రం లేకుండా వ్యవహరిరిచాలి. కేవలం చట్ట సభలు సవాళ్లు, ప్రతి సవాళ్లకే పరిమితం కాదు. చాలా చక్కటి విషయాలు వారు చర్చిస్తున్నారనే సుహృ ద్భావ వాతావరణాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అందించడానికి మనమందరం కలిసి కృషి చేయాలని ఈరోజు నేను కోరుతూ ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు నమస్సుమాంజలులు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

ఛైర్మన్ః వక్తలు చాలా మంది ప్రసంగించడానికి సిద్ధంగా ఉన్నారు.

శ్రీ జూపూడి ప్రభాకరరావుః అధ్యక్షా, గౌరవనీయులైన పెద్దలు ఈ రాష్ట్రాన్ని శస్త్ర చికిత్స చేయడానికి, ఇప్పుడున్నటువంటి పొల్యూటెడ్ రాజకీయాలను బాగుచేయడానికి ఒక డాక్టరుగా శస్త్రచికిత్సలకు పూనుకుంటున్న గౌరవ ముఖ్యమంత్రి డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డిగారు, అదే విధంగా అనుభవంతో తలపండిన పెద్దలు ఈ సభలో ఉన్నారు. నిజంగా బయట సభలలో అనర్గలంగా ప్రసగించే నాకు ఇక్కడ మాట్లాడాలంటే చేతులు వణుకుతున్నాయి. ప్రస్తుతం ఏప్రిల్ మాసంలో మనం ఉన్నాం . ఈ ఏప్రిల్ నెలకు క్యాలండర్‌లో చాలా ప్రాధాన్యత ఉంది. ఏప్రిల్ నెల అనగానే ఈ దేశానికి గుర్తు వచ్చేది డా.బి.ఆర్.అంబేద్కర్‌గారు, వారు భారతదేశానికి ఇచ్చిన రాజ్యాంగం. ఆ రాజ్యాంగం ప్రకారం ఏర్పడిన ఎగువ సభ, దిగువసభలు. ఈ ఎగువ సభలో ఉన్నటువంటి మిత్రులందరూ దిగువసభ అయిన శాసనసభలో ఏమైనా తప్పొప్పులు జరుగుతుంటే జాగ్రత్తగా పరిశీలించాలి. వాటిని సరిచేయాలనే ఉద్దేశంతో ఎగువసభను ఏర్పరచడం జరిగింది. అలాంటి ఎగువసభను ఈ రాష్ట్రానికి తెచ్చినటువంటి ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

రాష్ట్రంలో ఉన్న రెండుకోట్ల మంది దళితుల తరపున ఈ అవకాశాన్ని నాకు ఇచ్చినందుకు గౌరవ ముఖ్యమంత్రిగారికి, ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ముందుగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. విభిన్న వర్గాలనుంచి వచ్చిన మేధావులు ఈ సభలో ఉన్నారు. నిన్న మేం ఈ సభకు మొదటిసారిగా వచ్చినపుడు చదవమని బక్షీగారి పుస్తకం మాకు ఇచ్చారు. దీనితోబాటు డి.డి.బసుగారి పుస్తకాలను, కశ్యప్‌గారి పుస్తకాలను ఇచ్చారు. అదేవిధంగా ప్రస్తుత ఎగువసభ ఛైర్మన్‌గారు రాసిన పుస్తకాం కూడా అందరికీ ఇస్తే బాగుంటుందని విన్నవిస్తున్నాను. బక్షీగారి పుస్తకంలో, బసుగారి పుస్తకంలో కొన్ని విషయాలు దొరకుతాయి. ఆ రెండింటిలో దొరకనివి కశ్యప్‌గారి పుస్తకంలో దొరుకుతాయి. ఈ సభలో ఎందరో మేధావులున్నారు. ఇంకా ఏమైనా కావాలంటే డా.కె.నాగేశ్వర్‌గారి అనాలసిస్ మ్యాగజైన్‌లలో దొరకుతాయి. నేను ఐఏఎస్‌కు, గ్రూప్-1కు ప్రిపేర్ అయ్యే సందర్భంలో వీటన్నింటిని నేను విద్యార్థి దశలో ఉండగా గమనించాను. ఈ సభలో ప్రస్తావించిన వారిలో మాణిక్యరావుగారు గానీ, మాధవరావు గానీ వారంతా మా కాలేజీలో మాకు గురువులు. వారు ప్రాతినిధ్యం

వహించిన ఈ సభలో నాకు అవకాశం ఇచ్చినందున ఈ రాష్ట్రంలోని రెండు కోట్ల మంది దళితుల మీద మాకున్నటువంటి సమస్యలను చెప్పడానికి ప్రయత్నిస్తామని, మేం ఎక్కడా హద్దులు దాటమనీ, మైకులు విరగగొట్టమని, సభా సాంప్రదాయాలను ఖచ్చితంగా పాటిస్తామని తెలియజేస్తున్నాను.

ఎగువ సభ పెద్దల సభగానే ఉండాలని కోరుకుంటున్నాను. గొంతుకు, ధోరణికి, మనోభావాలకు కూడా విలువ ఇవ్వాలని, పార్టీలకు అతీతంగా ఒక పద్ధతిలో పెద్దల సభ అంటే పెద్దల సభగానే ఉండాలని కోరుకుంటున్నాను. సహజంగా ఇంట్లో పిల్లలు హద్దులు దాటి పక్కదోవ పడుతుంటే తల్లిదండ్రులు ఎలా అనునయిస్తారో, ఆ విధంగా మనమందరం కూడా వ్యవహరించాలి. ఈ రాష్ట్ర ప్రభుత్వంమీద అణగారిన వర్గాల ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వారి ఆశలను, మనోభావాలను నిర్భయంగా తెలియజేసే అవకాశాలను మనం ఖచ్చితంగా కల్పించాలి. ఈ పెద్దల సభద్వారా అనగా మీ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చేందుకు మాకు ఆనందంగా ఉంది. చివరగా నేను ప్రసంగించేందుకు నాకు అవకాశమిచ్చినందుకు మీకు కృతజ్ఞతలు తెలియజేసన్నాను.

డా.కె.రాజ్యలక్ష్మీ: అధ్యక్షా, మీగురించి, మీ ప్రతిభా పాటవాల గురించి గౌరవనీయ ముఖ్యమంత్రిగారు చెప్పారు. ఇంకా చాలా మంది వక్తలు ఈ విధాన పరిషత్ ఎలా ఉండాలి, ఏ విధంగా ఈ సభలో మన బాధ్యతలను నిర్వర్తించాలని కూడా చెప్పడం జరిగింది. ఈ పరిషత్‌లో చాలా మంది అనుభవజ్ఞులైన పెద్దలున్నారు. అదే విధంగా ఉత్సాహవంతులైన వారు కూడా ఉన్నారు. న్యాయశాస్త్ర కోవిదులైన మీరు రాసిన గ్రంథాలు మాకందరికీ మార్గనిర్దేశకాలు అవుతాయని ఆశిస్తున్నాను. మితభాషి, సౌమ్యులైన మీరు ఈ సభలో అందరిచేత ఏకగ్రీవంగా ఏన్నుకోబడినందుకు మీకు అభినందనలు తెలియజేస్తున్నాను. అదే విధంగా ఈ సత్సంప్రదాయాన్ని ఈ సభలో అందరూ పాటిస్తూ, ఈ సభా సాంప్రదాయాలను గౌరవిస్తూ, ఈ పరిషత్‌కు మంచి పేరు తెస్తారని ఆశిస్తున్నాను. నాకు ఈ అవకాశం ఇచ్చిన పెద్దలందరికీ మనఃపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఉ 11.40

శ్రీమతి మజ్జి శారద:– అధ్యక్షా, ఈ నూతన శాసన మండలి ప్రథమ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన మీకు నా హార్థిక శుభాకాంక్షలు. అభినందనలు. ఈ నూతన శాసన మండలి ఏర్పాటుకై అచంచలమైన దృఢ దీక్షతో అవిరళ కృషి చేసిన శ్రీ ముఖ్యమంత్రి గారికి కూడా నా హృదయపూర్వకమైన ధన్యవాదాలు, శుభాకాంక్షలు. మీరు స్నేహశీలులు. మృదుస్వభావులు. మీ మృదు స్వభావంతో అందరినీ సమ దృష్టితో అంద రికీ అందుబాటులో ఉంటూ ఇంతకు పూర్వం మా అందరినీ చాలా ముందుకు నడిపించారు. ఇప్పుడు కూడా మీ అపార అనుభవంతో ఈ మండలిని ముఖ్యంగా ఏ అనుభవం లేని మాలాంటి నూతన సభ్యులను ప్రభావితం చేయగలరని నేను ఆశిస్తున్నాను. అంతే కాకుండా మా నూతన సభ్యులకు మంచి విలువలను కూడా నేర్పి సత్ సంప్రదాయాలకు ఉరవడిగా తీర్చిదిద్ది ఇంతకు పూర్వం ఈ సభలో ఉండే పెద్దవారి తాలుకా అనుభవాలను నేర్పించి మమ్ములను కూడా అంతటి పెద్దవారిగా తీర్చిదిద్దగలరని మీ సభా అధ్యక్షతలో మేము అవన్నీ నేర్చుకోగ లగాలని ఈ సభ అదే సత్ సంప్రదాయాలతో నడవగలరని నేను పూర్తిగా విశ్వసిస్తున్నాను. అంతే కాకుండా ఇది అన్ని ప్రాంతాల ప్రజా సమస్యలకు, అన్ని సమస్యలకు చర్చా వేదికై ఈ చర్చలలో ప్రజల మనోభావాలను ప్రతిఫ లింప చేసేట్లుగా ఇక్కడ చర్చలు జరిగి ఈ సభ మళ్లీ నూతనంగా ఆవిర్భవించడం అన్నది మంచి కార్యక్రమం అన్న విధంగా ఉండాలి. ఈ సభను ఏర్పాటు చేసి చాలా మంచి పని చేశారు అని అందరూ హర్షించే విధంగా

దీనిని తీర్చిదిద్దగలరని హృదయపూర్వకంగా ఆశిస్తున్నాను. నాకు ఈ అవకాశం ఇచ్చిన సభా అధ్యక్షుల వారికి, ఇక్కడున్న పెద్దలందరకి, ముఖ్యమంత్రి గారికి,అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. జైహింద్.

శ్రీమతి ఎమ్. లక్ష్మీదేవి:– అధ్యక్షా, 22 సంవత్సరాల క్రితం ఈ ఎగువ సభ రద్దు చేయడం జరిగింది. ఈ విషయం మీ అందరికీ తెలిసినదే. కానీ ఈ రోజు రాష్ట్ర పరిపాలన దేదీప్యమానంగా జరగాలంటే మేధావుల సలహాలు చాలా అవసరం అని గ్రహించినటువంటి ముఖ్యమంత్రి గారు ప్రధానమంత్రి గారిని, మన నాయకురాలు సోనియాగాంధీ గారిని వారి మేధావితనంతో ఒప్పించి ఈ పరిస్థితులలో మండలి యొక్క అవసరం చాలా ఉందని ఒప్పించి ఈ మండలిని మళ్లా పునరుద్ధరించిన ఘనత వారికే దక్కింది. వారికి మనం అందరమూ కూడా కృతజ్ఞతలు తెలియజేయాలి.

అధ్యక్షా, మిమ్ములను గురించి ఆమూలాగ్రంగా ముఖ్యమంత్రి గారు చెప్పారు. మీరు చేసిన ఘనమైన కార్యక్రమాలు మీకు ఉన్నటువంటి విజ్ఞత, న్యాయశాఖలో కూడా మీరు అందించిన కృషి పార్టీకి ఎంతో ఉంది. ఈ రోజు ఈ మండలి రావాలంటే నేను ఢిల్లీలో కానీ, హైదరాబాదులో కానీ చాలా సార్లు చర్చించారు అధ్యక్షుల వారు. వారి ఆవేదనను, ప్రజల ఆవేదనను, మేధావుల ఆవేదనను గుర్తించుకుని దీనిని ఏ విధంగా తీసుకురావాలి అన్నటువంటి ప్రక్రియలో ఎన్నో సలహాలు లిఖిత పూర్వకంగా ఇచ్చారు. అది అందరి మనసులను ఆకర్షించేలా ఉంది. పార్టీకి అహర్నిశలు 24 గంటలూ గాంధీభవన్‌లో ఎవరు ఉంటారు అంటే చక్రపాణి గారు అందుబాటులో ఉండేవారు. ఆ విధంగా పార్టీకి ఎనలేని సేవలు చేశారు. నేను 10 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా ఉన్నాను. మీరు మర్చిపోయి ఉంటారు. మీరు జనరల్ సెక్రటరీగా, ఉపాధ్యక్షులుగా పని చేశారు. మహిళలకు ఏ కార్యక్రమం గురించి చర్చించాలన్నా ఇబ్బంది వచ్చినా ఆ కార్యక్రమాలను గుర్తించి చర్చించి ఎంతో ఉత్సాహంగా సహకరించేవారు. దానికి మహిళలం అందరమూ కూడా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అధ్యక్షా, మీరు బడుగు బలహీన వర్గాలకు అందించిన సేవ అమోఘమైనది. రాష్ట్రంలో కానీ, ఏ జిల్లాలో కానీ ఎక్కడ ఏ ఇబ్బందులు జరిగినా, బి.సి., ఎస్.సి., ఎస్.టి ల సమస్యలు కానీ దానిని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి సహకరించిన ఘనత మీకు ఉంది. అటు ప్రజలలో ఉన్న విశ్వాసం, నమ్మకం ఈ సభ మీద పోయింది. నాతో ఎంతోమంది విజ్ఞులే కాక సామాన్య మానవులు కూడా చర్చిస్తుంటారు. ఎందుకు మేడమ్ ఈ సభలు? ఒకరిని ఒకరు విమర్శించుకోవడానికా? లేక ప్రజల సమస్యలను పరిష్కారం చేయడానికా? అంటే దానికి మా దగ్గర జవాబు లేదు. ఎందుకంటే ప్రాక్టికల్‌గా చూస్తున్నాము. ఆ యొక్క మాటా రాకుండా మనం ఈ మేధావుల సభకు ఉన్నటువంటి విలువలను మనం పెంచాలి. ప్రజలలో మళ్లీ విశ్వాసం కలగాలి. ఈ సభల ద్వారా మనకు ఎంతో మేలు జరుగుతుంది అన్న విశ్వాసం పోయింది. దానిని మరలా ఈ సభ ద్వారా నే సాధించాలి. అందుకని అధ్యక్షా మీరు బాగా మేధావులు. అనుభవం ఉన్నవారు. ఓర్పు, సహనం ఉన్నటువంటి వారు. ఇన్ని రకాల మనుషులు ఉన్న అందరినీ ఒప్పించి బాగా సమాధానపరచే శక్తి సామర్థ్యాలు ఉన్న అధ్యక్షులు కాబట్టి మీకు మనవి చేస్తున్నాను. ప్రజలకు ఉన్న భావన మార్చాలి. ప్రజలకు విశ్వాసం కలిగించాలి. ఈనాడు ఎంతో శక్తివంతమైన ముఖ్యమంత్రి గారు ఉన్నారు. ప్రజల యొక్క సమస్యలను తీర్చడానికి అనేక రకాలుగా పని చేసేటువంటి గొప్ప నాయకుడు. వారిని అంతా దృష్టిలో ఉంచుకుని మీరు అంతా కూడా మనం అందరమూ కూడా పెద్దలు రోశయ్య గారు, నాగేశ్వర రావు గారు చెప్పినట్లు బాగా సభ యొక్క విలువలు, సభ యొక్క మర్యాద పెంచడానికి వారు ఇచ్చిన సలహాలను పాటించి మనం అంతా కృషి చేయాలని చెప్పి ఈ సందర్భంగా మనవి చేస్తూ మీకు మా అభినందనలు తెలియజేస్తు సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె. దిలీప్‌కుమార్:-(వరంగల్, ఖమ్మం అండ్ నల్గొండ) అధ్యక్షా, మహా మేధావులు, ప్రతిభా వంతులు, మేధావులు, నిష్ణాతులు, పండిత మేధో మధనానికి నిలయమైన శాసన మండలి కొత్త జవసత్వాలతో పునరుద్దరించడం శుభపరిణామం ఇది. ఎంతో ఉన్నత భావాలు గల అనుభవజ్ఞులు, సౌమ్యులు అయిన మీరు ఈ సభా అధ్యక్షులుగా ఉండడం మా అదృష్టం. మీ బాధ్యతల నిర్వహణలో మా సహాయ సహకారాలు అంది స్తాము. ఇంతటి ప్రతిష్టాత్మకమైన చైర్మన్ పదవిని అలంకరించిన మీకు నా తరఫున తెలంగాణా ప్రజల తరఫున, తెలంగాణా రాష్ట్ర సమితి తర ఫున, చంద్రశేఖర రావు గారి తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు, శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. రాజకీయ అనాలోచిత చర్యల కారణంగా 1985 లో రద్దయిన శాసన మండలి సుమారు 22 సంవత్సరాల తరువాత ప్రజల ఆకాంక్ష మేరకు పునరుద్ధరించబడింది. ఈ సభకు ఏకగ్రీ వంగా మీరు చైర్మన్ గా ఎన్నిక కావడం మాకు ఎంతో ఆనందం కలిగిస్తున్నది. శాసన మండలిలో మీకు ఉన్న పూర్వ అనుభవం, అంతకు ముందు శాసన మండలికి ఉపాధ్యక్షులుగా పదవీ బాధ్యతలు నిర్వహించిన అను భవం ఉంది. న్యాయ శాస్త్రంలో అపార మేధావులైన మీరు అన్ని రంగాల ప్రజలకు న్యాయం చేకూర్చడానికి ఖచ్చి తంగా ఈ చర్చలకు దశ దిశ నిర్దేశం ఉంటుందని, మీ ఆధ్యర్యంలో మంచి ఫలవంతమైన చర్చలు ఈ సభలో జరగాలని, ఫ్రూట్‌ఫుల్ డిస్కషన్స్‌కు ఈ సభ వేదిక కావాలని మేము అందరమూ కూడా ఆహ్వానిస్తున్నాము.

ఉ. 11.50

అయితే అన్యాయానికి, అణచివేతకు, నిర్లక్ష్యానికి, దోపిడీకి గురియైన ఈ తెలంగాణా ప్రాంతం వారి బాణి, వాణి వినిపించడానికి మా కెసిఆర్ యిచ్చిన ఉద్యమ స్పూర్తితో , ఈ సభను నడిపే మీకు , మాకు సంఖ్యా బలం లేకపోయినా తెలంగాణా వాదాన్ని ఎలుగెత్తి చాటడానికి మీరు సహృదయంతో ఉదారంగా అవకాశం యిస్తారనే విశ్వాసం మాకుంది. గవర్నర్ గారు ప్రసంగిస్తూబ్రిటన్‌లో హౌస్ ఆఫ్ లార్డ్స్ గురించి, అమెరికాలో సెనేట్ గురించి, ఇండియాలో రాజ్యసభ గురించి ప్రస్థావించారు. బ్రహ్మాండంగా చర్చలు జరిగాయి. ఆ చర్చల ఫలితం ఈ దశలో పొందుతాము. అదే విధంగా ఇక్కడ ఒక సౌహా్ర్ద వాతావరణం ఏర్పడి, మీ నేతృత్వంలో ప్రజాస్వామ్యం పరిధివిల్లే విధంగా చర్చలు జరగాలనే ఆశ మాకు వుంది. మీ అధ్యక్షతన హుందాగా సభా కార్యక్రమాలు నిర్వహించాలని మేము ఆశిస్తున్నాము. గతంలో చైర్మన్‌గా వున్న ఎంతో మంది పెద్దల పేర్లు చెప్పారు. మాడపాటి హ నుమంతరావు, ఉద్దండులు గొట్టిపాటి బ్రహ్మయ్య, తోట రామస్వామి, వెంకటసుబ్బయ్య , జనాబ్ సయ్యద్ ముఖసీర్షా, వీరందరు ఏర్పరచిన బాటలో ఈసభ ముందుకు సాగుతుందని ప్రగాఢంగా విశ్వసిస్తున్నాము. గతంలో ప్రజా సంక్షేమం కొరకు అమూల్యమైన సలహాలను యిచ్చిన గొప్ప వారు ఈసభలో వున్నట్లు మేము తెలుసుకున్నాము. వరుసగా ఉపాధ్యాయ నియోజకవర్గానికి మూడుసార్లు ఎన్నికై 18 సంవత్సరాల కాలం ఈసభలో వున్న బి.వి. రాఘువాచార్యులు గారు తెలంగాణా జిల్లా నుండి వచ్చిన గొప్ప వ్యక్తి. వారు ఎన్నో ప్రసంగాలు చేసి అందరి మన్ననలు పొందారు. అదే విధంగా కమ్యూనిస్టు నాయకుడు జనాబ్ మగ్దుం మొహియుద్దీన్ పన్నెండు సంవత్సరాల సుదీర్ఘకాలం ప్రతిపక్ష నాయకుడుగా వ్యవహరించి నిర్మాణాత్మకమైన సూచనలు చేశారని విన్నాము. తెలంగాణా ముద్దుబిడ్డ కాళోజీ నారాయణరావు తెలంగాణా వాణి వినిపించి ప్రజా ప్రతినిధులకు మార్గదర్శిగా నిలిచినట్లుగా పెద్దల నుండి తెలుసుకున్నాము. ప్రపంచ ఖ్యాతి పొందిన నేరెళ్ల వేణుమాధవ్ యిదే సభలో ప్రాతినిధ్యం వహించి గౌరవం, వన్నె తెచ్చారు. అత్యంత గౌరవప్రదమైన సభకు మండలి సభ్యులుగా రావడం మా అదృష్టంగా భావిస్తున్నాను. మీ నేతృత్వంలో రాబోయే కౌన్సిల్ సమావేశాల్లో ప్రజా సమస్యలకు అద్దం పట్టాలని, అన్ని పార్టీలు చక్కటి పాత్ర వహించేటట్లు, ప్రజా సమస్యల విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకునేటట్లు సభ మార్గదర్శకత్వం వహించాలని మీ నేతృత్వం

వుండాలని ఆశిస్తున్నాను. సుదీర్ఘంగా చర్చించి సహేతుకమైన నిర్ణయాలు చేయడమే ప్రజాస్వామ్యం అని ప్రముఖ పార్లమెంటేరియన్ విలియం బాగ్‌హర్ట్ అన్నారు. అదే విధంగా ఆ సాంప్రదాయాలను కాపాడాలని ఈ సభ అందుకు ఆదర్శంగా నిలవాలని ,మీ అనుభవం దానికి -ఉపయోగపడాలని మేము కోరుతున్నాము. ప్రజా అభిమతానికి అనుగుణంగా 22 సంవత్సరాల అనంతరం ఎన్నో అవాంతరాలను అధిగమించి ఈ సభను ఏర్పరచుకున్నాము. ఈ సభ ఏర్పడడానికి మీరు ఎంతో కృషి చేశారని పెద్దలు ప్రస్తావించారు. ఇదే సభలో రాజ్యాంగ అధికరణం 169 గురించి చర్చ జరగాలని, ఎప్పుడు పడితే అప్పుడు రద్దు చేసే పరిస్థితి లేకుండా, ఆ మాట అన్న వారికి కూడా అవకాశం యిచ్చి , డిటెయిల్డ్‌గా చర్చించి రద్దు కాకుండా ఈ సభను కాపాడాలని, ఈ సభ ద్వారా చర్చించి రేపు అవసరమైన రీతిలో చట్టాల దశా నిర్దేశం చేయాలని మీకు విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రజా సమస్యలను ప్రతిబింబించడానికి ప్రభుత్వ నిర్ణయాలపై విస్తృతంగా చర్చించడానికి అవకాశం కల్పించే కౌన్సిల్ ప్రాధాన్యతను గుర్తించి మనమందరం ప్రజాస్వామ్య పద్ధతిలో , ప్రజాస్వామ్యయుతంగా చర్చించాలని, కౌన్సిల్ అందుకు వేదిక కావాలని, మీ నేతృత్వంలో క్వాలిటీ డిబేట్ జరగాలని మా అందరి సహకారం వుంటుందని మీకు మనవి చేస్తున్నాను. తెలంగాణా నినాదంతో ఆవిర్భవించి తెలంగాణా సాధన ఏకైక లక్ష్యంగా ఉద్యమబాటలో ముందుకు వెడుతున్న వారి ప్రతినిధులుగా మా తెలంగాణా రాష్ట్ర సమితి సభ్యులుగా మేము పూర్తి సహాయసహకారాలు అందజేస్తాము. తెలంగాణా వాణి ఈసభలో వినిపించడానికి మరొక వేదికగా మేము భావిస్తున్నాము. ఏకగ్రీవంగా ఎన్నికైన మీకు మా అందరి తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ అవకాశం యిచ్చిన మీకు ధన్యవాదాలు.

శ్రీ సింగం బసవపున్నయ్య: అధ్యక్షా, ఈ మేధావుల సభకు ఏకగ్రీవంగా అధ్యక్షులుగా ఎన్నికైనందుకు మిమ్ములను నేను అభినందిస్తున్నాను. మిమ్ములను అధ్యక్షుడుగా మొదటిసారిగా ప్రపోజ్ చేసిన సంతకం నాదే అయినందుకు నేనెంతో గర్వపడుతున్నానని చెబుతున్నాను. ఇక మిమ్ములను గురించి నాకంటే ముందు మాట్లాడిన ముఖ్యమంత్రిగారు కానీయండి, మిగిలిన పెద్దలు కానీయండి అనేక విషయాలు చెప్పారు. వారితో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. అవే విషయాలు మరలా చెబితే నేను అనవసరంగా స్తోత్రం చేస్తున్నానని అనుకుంటారు కాబట్టి ఆ విషయానికి వెళ్లడం లేదు. మిమ్ములను గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు, మీ పేరే చక్రపాణి, వేరే చెప్పవలసిన అవసరం లేదు. చాలామందికి తెలియదు గానీ మీ చక్రం మహిమ నాకు తెలుసు. ఎప్పుడు వాడతావో, ఎప్పుడు తిప్పుతావో, ఆ దేవుడికే తెలుసు, నీకే తెలుసు. ఏది ఏమయినా మీరు అధ్యక్షుడుగా కూర్చున్నప్పుడు ఈ సభకు మరింత కీర్తి రావాలని కోరుతున్నాను. ఈ సభను తిరిగి పెట్టడానికి, పునరుద్ధరణకు కారణమైన మా నాయకులు రాజశేఖర రెడ్డి గారిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అభినందిస్తూ రాబోయే సెషన్‌లో ప్రత్యేకంగా తీర్మానం పెట్టాలనుకుంటున్నాను, ఆనాడు అన్ని విషయాలు మాట్లాడతాను, ఈనాడు మాట్లాడను. ఏది ఏమయినా మీరు అధ్యక్షునిగా మంచి కీర్తి గడించాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. నేను సమస్యలను గురించి మాట్లాడదలచుకోలేదు. కొంతమందికి రెండేళ్లకు రద్దవుతుందని భయం వుందేమో, చాలా సమస్యలను గురించి మాట్లాడారు. నాకు ఆ భయం లేదు. ఇప్పుడు సమస్యలను గురించి మాట్లాడే వేదిక కాదు. మిమ్ములను గురించి మాట్లాడాలనే తపనతో నేను లేచాను. మీరు అధ్యక్షునిగా మంచి కీర్తిప్రతిష్టలు కలుగజేయండని, సభ కీర్తిని పెంచండని , పెంచడానికి అవకాశం కల్పించండని , ఆ విధంగా దీవించాలని భగవంతుని ప్రార్థిస్తూ మీ దగ్గర సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎలమంచిలి వెంకట బాబు రాజేంద్రప్రసాద్ : (కృష్ణా) అధ్యక్షా, మీరు ఈరోజున ఈ శాసనమండలికి ఏకగ్రీవంగా అధ్యక్షులుగా ఎన్నికైనందుకు మా హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు

తెలియజేస్తున్నాము. మీ గురించి, మీ చరిత్రగురించి సవివరంగా ముఖ్యమంత్రిగారు చెప్పారు. విద్యార్థి దశ నుండి సంఘసేవా భావంతో విద్యార్థి ఉద్యమాలు తెచ్చినట్లు చెప్పారు, చాలా సంతోషం . మీ అనుభవంతో మీకున్న సమర్థతతో మా బోటి యువతరానికి, కొత్తవారికి పూర్తి సహాయసహకారాలు అందించి, మమ్ములను కూడా షైన్ చేస్తారని ఆశిస్తున్నాను. అదే రకంగా అధ్యక్షా, మా గ్రామీణ ప్రాంతాల ప్రజాప్రతినిధులుగా పంచాయతీరాజ్ ప్రజా ప్రతినిధులుగా మేము వచ్చాము. మాకు కొంత అవకాశం యిప్పించాలి మీరు, ఎందుకంటే మేము ఆరున్నర కోట్ల అమాయకులైన గ్రామీణ ప్రజానీకం యొక్క ప్రతినిధులుగా 78 శాతం గ్రామీణ ప్రజానీకానికి, 82 శాతం భూభాగానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పంచాయతీరాజ్ ప్రతినిధులుగా వచ్చాము. మేధావులు, తెలివిగలవారైన 8 మంది టీచర్స్, 8 మంది గ్రాడ్యుయేట్స్ రిప్రజెంటేటివ్స్ డామినేషన్‌లో మా 31 మంది స్థానిక సంస్థల ప్రతినిధుల వాణి గతంలో కూడా గట్టిగా వినపడలేదు. శాసనమండలి గురించి వస్తే టీచర్స్ సభగా పరిగణింపబడడం తప్ప మరొకటి లేదు. పంచాయతీరాజ్ వ్యవస్థ చాలా సమస్యల్లో, యిబ్బందుల్లో వుంది కాబట్టి, భవిష్యత్తులో అమాయక గ్రామీణ ప్రజానీకానికి తగిన ప్రాతినిధ్యం వహించే విధంగా ,వారికి అవకాశం యిచ్చే విధంగా చేయవలసిందిగా కోరుతున్నాను. అదేవిధంగా యిందాక పెద్దలు మాట్లాడుతూ చెప్పారు మనకు మనం మేధావులమని, మేధావుల సభ అని అనుకుంటే సరిపోదని అనుకుంటున్నాను. ప్రజలు ఆరకంగా అనుకోలేదు. వారు అనుకోవాలంటే ఆ స్థాయిలో మనం పని చేయాలని నేను భావిస్తున్నాను. ఇందాక పెద్దలు మాట్లాడుతూ చెప్పారు పత్రికలు పునరావాస కేంద్రంగా నిరుద్యోగ కేంద్రంగా పరిగణిస్తున్నాయి శాసనమండలిని అని చెప్పారు. అది వాస్తవమే అధ్యక్షా. ఒక శాసనమండలి, మేధావులసభ ఏర్పడుతూ వుంటే ఇది ఒక ముఖ్య ఘట్టంగా, చారిత్రకఘట్టంగా పత్రికల్లో ఎక్కడా గ్రాండ్‌గా హెడ్డింగ్‌లతో రాలేదు. అలాగే టివి న్యూస్‌లో హెడ్ లైన్స్‌లో, ఫస్ట్ న్యూస్‌గా రాలేదు. మన తోటి మేధావులు, పత్రికారంగ విలేకరులను మేధావులు అని అనుకుంటాము. వారు మనలను మేధావులుగా, మేధావుల సభగా గుర్తించి ప్రిఫరెన్స్ యివ్వడం లేదు. దీన్ని పునరావాస కేంద్రంగా భావించడం జరుగుతోంది. శాసనసభ చేసిన తీర్మానాలను ప్రభావితం చేయగలిగిన శాసనమండలిగానే హైలైట్ చేసి పత్రికల్లో, టివి ఛానల్స్‌లో పదే పదే రావడం జరుగుతోంది. చట్టపరంగా ఆ పరిమితులు మనకు వున్నా ప్రతిభావంతంగా పని చేయాలంటే మన మిత్రులు యిప్పటివరకు చెప్పారు దీనిని పునరుజ్జీవింపజేసిన ఘనకీర్తి ముఖ్యమంత్రికే వస్తుందని అన్నారు.

మ.12.00

అలాగే దీని కీర్తి ప్రతిష్టల్ని నిలబెట్టవలసిన ఆ బాధ్యత, ఆ గౌరవాన్ని కూడా ముఖ్యమంత్రిగారే దక్కించుకోవాలి. ఎందుకంటే ఇక్కడ మేమందరం మా మా రంగాల్లో ఉన్న సమస్యల్ని ప్రస్థావించినపుడు, దయచేసి ముఖ్యమంత్రిగారు వాటిని ఆలకించడమే కాకుండా, వాటిని అమలు పరచినపుడే, అంటే మా అభిప్రాయాలకు గౌరవం ఇచ్చినపుడే తప్పనిసరిగా మన శాసన మండలికి కూడా ఆ గౌరవం వస్తుంది. దాని సభ్యులుగా మాకూ గౌరవం వస్తుంది. అధ్యక్షులుగా మీకూ గౌరవం వస్తుంది. అప్పుడే పత్రికా రంగం వాళ్లు తమ హెడ్‌లైన్స్‌లో మన యొక్క శాసనమండలిని తీసుకుని వెళ్లతారని భావిస్తున్నాను. ఏది ఏమైనా ఎంతో విజ్ఞులైన మిమ్మల్ని గౌరవించాలని చెప్పి, అదే రకంగా ఒక సత్సంప్రదాయాన్ని నెలకొల్పాలని చెప్పి మా నాయకుడు చంద్రబాబునాయుడుగారు చాణక్య నీతి ప్రకారం, రాజకీయాల్లో నిలబెట్టాలి, పోరాడాలి. అయినా ఆ చాణక్య నీతిని ప్రక్కన పెట్టి, తెలుగుదేశం పార్టీతరఫున అధ్యక్ష పదవికి పోటీ పెట్టకుండా, మీరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే విధంగా చేసి, శాసనమండలికి గౌరవం ఇవ్వాలని, దాని ఔన్నత్యాన్ని నిలబెట్టాలని .........

(శ్రీ పి. సుధాకర్ నుండి అంతరాయం)

పోటీపడటం రాజకీయ ధర్మం. మీరు చేయలేదా? మేము 20 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు, మీరు మీ అభ్యర్థుల్ని నిలబెట్టలేదా? మీరు మీ అభిప్రాయాలు చెపుతున్నప్పుడు మేము విన్నాము. మా అభిప్రాయాలు చెపుతున్నప్పుడు కూడా దయచేసి మాట్లాడకుండా ఉంటే బాగుంటుంది. ఈ సభలో నాగేశ్వర్, చుక్కా రామయ్య వంటి పెద్దలు, మేధావులు ఉన్నారు. కాబట్టి ఈ సభను ఉన్నతంగా ముందుకు తీసుకుని వెళ్లాలని, శాసనమండలిని మరో శాసనసభగానో, ఇంకొక సభగానే చేయకుండా ముఖ్యంగా ముఖ్యమంత్రిగారు, మీరు ఎప్పుడూ ఈ సభ యొక్క ఔన్నత్యాన్ని నిలబెట్టవలసిన బాధ్యత మీ మీద ఉందని తెలియచేస్తూ, మీకు మా యొక్క సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలియచేస్తున్నాను.

శ్రీ మహమ్మద్ జానీ : అధ్యక్షా, మీ ఏకగ్రీవ ఎన్నిక మా అందరికీ ఆనందదాయకము. 22 సంవత్సరాల తర్వాత ఏర్పడిన ఈ సభ, ఈ సభలో జరిగే చర్చలు సఫలవంతం కావాలని, మీ అధ్యక్షతన ఆ ఫలాలన్నీ ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరికీ చెందాలని మొదటి మాటగా నేను విజ్ఞప్తి చేస్తున్నాను. మీరు విద్యావంతులు, విషయ పరిజ్ఞానం కల్గిన వారు, విషయాన్ని విశ్లేషించే శక్తిసామర్థ్యాలు గల వారు. మీ గురించి నేను ఇంత కన్నా ఎక్కువ చెప్పదలచుకోలేదు. మీ నాయకత్వంలో నిజంగా ఈ సభలో అర్థవంతమైన చర్చ జరుగుతుందని, ఆ చర్చ ప్రజల మాట అవుతుందని, ఇక్కడి ప్రతి మాట ప్రగతికి బాట వేస్తుందని, ఈ ప్రభుత్వం పయనిస్తున్న ప్రగతిబాటలో భాగమవుతుందనే మాట మనవి చేస్తున్నాను. అలాగే ఈ సభలో మంచి వాతవరణాన్ని సృష్టించే బాధ్యత ఇక్కడి సభ్యులందరిది. విజ్ఞానవంతులు, విద్యావంతులు, అలాగే ఇందాకే రాజేంద్రప్రసాద్ చెప్పినట్లుగా, గ్రామీణ వ్యవస్థకు పట్టుగొమ్మ అయిన పంచాయితీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేసిన వాళ్లు, అలాగే టీచర్లు, రాజకీయ ఉద్ధండులు అనేకమంది ఈ సభలో ఉన్నారు. ఈ సభ యొక్క ఔన్నత్యాన్ని కాపాడవలసిన బాధ్యత మనందరి మీద ఉంది. ఇందాక రాజేంద్రప్రసాద్‌గారు ఏదో రాజకీయంగా లాగడానికి ప్రయత్నించారు. అటువంటివి ఉన్నా, సర్దుకుని, మన ఔన్నత్యాన్ని నిలబెట్టే విధంగా చర్చలు చేద్దాము. ఆ చర్చలు రాష్ట్ర ప్రజలకు మేలు జరిగేటట్లుగా సమగ్ర, సమక్య ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందేటట్లుగా ఉండాలని మరోసారి కోరుకుంటూ మిమ్మల్ని అభినందిస్తున్నాను. ఈ విజయగీతిక ఇంకా ముందుకు సాగాలని, మీ నాయకత్వంలో విజయబాటలో నడిచే విధంగా ఈ సభ రూపుదిద్దుకోవాలని ఆశిస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ రుద్రరాజు. పద్మరాజు : అధ్యక్షా, 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి, ఎప్పుడూ కూడా అటు పార్టీలో గాని, ఇటు శాసనమండలిలో గాని మీ వాణిని వాడిగా, వేడిగా వినిపిస్తూ చక్కని కార్యక్రమాలు ఏర్పాటు చేసి, ఎప్పుడూ కూడా అన్ని వర్గాల వారిని ప్రేమిస్తూ, వారి యొక్క ఆదరాభిమానాలకు నిలయమైన మిమ్మల్ని ఈ రోజు శాసనమండలిని పునరుద్ధరించిన తర్వాత ఏకగ్రీవంగా ఎన్నుకోవడం రాష్ట్రంలోని ప్రజానీకానికి, అదే విధంగా సభ్యులుగా మా అందరికీ కూడా చాలా ఆనందంగా ఉందని చెప్పి, ఇది ఎంతో హర్షణీయమని చెప్పి ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను. పువ్వు పుట్టగానే పరిమళించును అన్న నానుడికి మీరు ప్రత్యక్ష ఉదాహరణ అని మనవి చేస్తున్నాను. అధ్యక్షా, మీరు విద్యార్థి దశలోనే ఉస్మానియా యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్‌కు ప్రాతినిధ్యం వహించారు. అదే విధంగా మీరు ఎల్‌ఎల్‌బి, ఎల్‌ఎల్‌ఎం చేసి, నాగపూర్ యూనివర్సిటి నుండి Constitutional Law లో మీరు డాక్టరేట్ తీసుకోవడం మీ యొక్క అపారమైన మేధాసంపత్తికి ప్రతక్ష నిదర్శనమని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. అదే విధంగా మీరు అటు విద్యార్థి నాయకుడిగా, ఇటు రాజకీయాల్లో 1972వ సంవత్సరం నుండి రాష్ట్ర కాంగ్రెస్‌లో ఎన్నో ఉన్నతమైన పదవులు అలంకరించి, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా, అదే విధంగా

ప్రతి ఎన్నికల ముందు పార్టీ ప్రచురించే ఎన్నికల మ్యానిఫెస్టోల్ని రూపుదిద్దడంలో మీ యొక్క అమోఘమైన అనుభవాన్ని, సహాయాన్ని అందించడం ఎంతైనా అభినందనీయం అని మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, మీకు ఉన్నటువంటి రెండు దశాబ్దాల రాజకీయ అనుభవంలో మీతో అత్యంత సన్నిహితంగా మెలగడం లేదా కలిసి పయనించే సమయంలో మేము కూడా ఎన్నో విషయాలు నేను నేర్చుకున్నాను. పునరుద్ధరించబడిన ఈ సభకు మీరు అధ్యక్షులుగా ఎన్నిక కావడం, ఆ సందర్భంగా మిమ్మల్ని అభినందిస్తూ మాట్లాడేందుకు ఈ సభలో సభ్యుడిగా కూర్చొనే అవకాశం నాకు కల్పించిన డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డిగారికి హృదయపూర్వకమైన నమస్కృతులు, అభినందనలు తెలియచేస్తున్నాను.

మీరు మూడు పర్యాయాలు రాష్ట్ర గవర్నర్ చేత నామినేట్ కావడం చాలా గర్వకారణం. 1972వ సం.లో ప్రప్రథమంగా గవర్నర్ మిమ్మల్ని ఈ మండలికి నామినేట్ చేయడమయింది. ఆనాడే మీరు ఈ సభలో చాలా చురుకైన పాత్రను పోషించారు. చీఫ్ విప్‌గా ఉండి ఈ మండలి సభ్యులకు మీరు ఎంతో సహకరించి, ఎంతో చక్కటి కార్యక్రమాలు చేపట్టారు. అదే విధంగా రెండవ పర్యాయం తిరిగి గవర్నర్ చేత నామినేట్ కాబడి, ఇదే సభకు ఉపాధ్యక్షులుగా ఎన్నుకోబడి, ఆ పదవీ రీత్యా ఎన్నో చక్కని కార్యక్రమాలు చేపట్టారు. మీ యొక్క అమూల్య సహాయ సహకారాల్ని వేయి నోళ్ల పొగడటం ఎంతైనా హర్షణీయం. అదే విధంగా రాబోయే రోజుల్లో వివిధ పార్టీలకు చెందిన సభ్యులందరు కూడా వారు ఇచ్చే సహకారంతో ఎంతో చక్కని అర్థవంతమైన చర్చలతో సభను నడిపించాలి. అందుకు మీకు మేము అన్ని విధాల సహకరిస్తామని మనవి చేస్తున్నాను. ఆవేశకావేశాలకు తావు లేకుండా అర్థవంతమైన చర్చలకు అవకాశం కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వానికి మన నుండి ఉన్నతమైన సలహాలు , సూచనలు ఇవ్వడం ద్వారా ఈ రాష్ట్రాన్ని ప్రగతిబాట వైపు తీసుకుని వెళ్లాలని కోరుతున్నాను. ఈ రాష్ట్రంలో ఉన్న ప్రజానీకం యొక్క అవసరాల్ని మనం గుర్తించి, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలి. వారి సమస్యల పరిష్కారానికి అవిశ్రాంతంగా పోరాడటానికి ఇక్కడ ఉన్న సభ్యులందరి సహకారంతో, మీ యొక్క అమూల్యమైన మేధా సంపత్తిని ఉపయోగించి, మిగతా రాష్ట్రాల్లోకెల్లా మన రాష్ట్రాన్ని ప్రగతిబాట వైపు తీసుకుని వెళ్లే విధంగా మనమందరం సమష్టి కృషి చేయాలని చెప్పి కోరుతున్నాను.

మ.12.10

అందరూ సమిష్టిగా కృషి చేయాలని, క్రమశిక్షణకు మారు పేరుగా ఆంధ్రప్రదేశ్ శాసన మండలి ఉందని చెప్పి, యావత్ భారత దేశంలో వన్నె తెచ్చే విధంగా ప్రతి సభ్యుడూ క్రమశిక్షణను పాటించాలని విన్నవిస్తూ, మీ అధ్యక్షతన ఫలప్రదమైన విధానంలో ముందుకు వెళ్లడానికి మా సహకారం తప్పనిసరిగా ఉంటుందని, అదే విధంగా భగవంతుడు మీకు ఆయురారోగ్య ఐశ్వర్యాలు ఇవ్వాలని కోరుకుంటూ నాకు అవకాశం ఇచ్చినందుకు హృదయపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్ : చాలా సమయం తీసుకున్నాం. నాలుగు గంటలకు మళ్లీ సంయుక్త సమావేశం అవుతాము. అపుడు సంయుక్త సమావేశం ఉంటుంది. మళ్లీ మాట్లాడుకుందాము. సమయం చాలా ఉంది. మొదటి రోజు కదా. చాలా మంది ఉన్నారు. నేను మనవి చేస్తున్నాను, మీరు అనుమతిస్తే, నా రిప్లయి కూడా తర్వాత ఇస్తాను.

శ్రీ పొంగులేటి సుధాకర రెడ్డి : అధ్యక్షా, 22 సంవత్సరాల తర్వాత ఏర్పడిన విధాన పరిషత్తు, దానికి మీరు అధ్యక్షులుగా ఎన్నిక కావడం మాకందరకూ హర్షదాయకమైన విషయమని మనవి చేస్తున్నాను. అంతేకాకుండా, గతంలో మీరు బాగా రాటు దేలిన వారు. అన్ని విషయాలలో బాగా ప్రజ్ఞాపాటవాలు కలిగిన వారు. న్యాయశాస్త్ర కోవిదులు. అనుభవం కలిగిన మీ వంటి వారు సభలో అధ్యక్షులుగా ఎన్నిక కావడం మాకు గర్వకారణమని మనవి చేస్తున్నాను. మేమందరం ఏకగ్రీవంగా మిమ్ములను ఎన్నిక చేసుకోవడం మా సభ్యులందరం మిమ్మల్ని అభినందిస్తూ, ఇంతకు ముందు పెద్దలు ప్రస్తావిస్తూ ఉపాధ్యాయ ప్రతినిధుల గురించి మాట్లాడటం జరిగింది. ఈ సభ ఉపాధ్యాయుల ప్రతినిధుల సభగా మారుస్తున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ఆ విధమైన అపప్రధ ఉండరాదని, ఎందుకంటే, రాజ్యాంగంలో పొందుపరచిన విద్య అత్యంత ప్రాముఖ్యత కలిగినదన్న విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రధానంగా రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే విద్యకు అత్యంత ప్రాముఖ్యత నివ్వవలసిన అవసరం ఉంది. అంతేకాక, తమ గురించి పెద్దలు రోశయ్య గారు, గౌ. ముఖ్యమంత్రి గారు కూడా మీ గురించి బాగా ప్రస్తావించారు. మేము నూతనంగా ఈ సభలో అడుగు పెట్టాము కాబట్టి, మీ గురించి అన్ని విషయాలూ తెలిశాక భవిష్యత్తులో మాకు అవకాశం ఇస్తారని ఆశిస్తూ, వచ్చే రోజులలో విద్య గురించి, దాని ప్రాముఖ్యత గురించి, ఉపాధ్యాయుల సమస్య గురించి ప్రస్తావించవలసిన అవసరం ఉంది.

ఈ రోజు పాఠశాలలు చాలా నిర్వీర్యం అవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు అంటే నమ్మకం లేకుండా ఉంది. అటువంటి అపప్రధను రూపుమాపడానికి పాఠశాల విద్యను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని మీ ద్వారా గౌ. ముఖ్యమంత్రి గారికి మనవి చేస్తున్నాను. అంతేకాకుండా, సర్వశిక్ష అభియాన్‌కు వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవలసిన అవసరం ఉంది. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఎన్ని ఉన్నాయో వాటిని సద్వినియోగం చేసుకోకపోవడం వల్ల అవి మురిగిపోయిన ఉదంతాలు చూస్తున్నాము. అట్లా మన రాష్ట్రంలో జరగకుండా సమర్ధవంతంగా అమలు జరిగేటట్లు సహాయ సహకారాలు అందిస్తామని, అంతేకాకుండా రాష్ట్రంలో విద్యాపరిపాలనలో విద్యకు సంబంధం లేని అధికారులను నియుక్తం చేస్తున్నారు. అది సరైన విధానం కాదు. విద్యశాఖకు సంబంధం లేని అధికారులను నియామకం చేయకుండా సమర్ధవంతంగా అమలు జరిగేలా, మీ హయాంలో రాను రాను రోజులలో విద్యకు సరైన ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నాను. టీచర్సు సమస్యలు ప్రస్తావించబడాలి. టీచర్సు సమస్యలను ప్రసావిస్తే సమాజానికి ఉపయుక్తంగా ఉంటుంది. అటువంటి కార్యక్రమాలలో ఉపాధ్యాయులు భాగస్వాములు అవుతారు. ఉపాధ్యాయులు భాగస్వాములు అయినపుడు ఉపాధ్యాయుల యొక్క ప్రభావం సమాజం మీద ఎక్కువ ఉంటుంది. దానికి అనుగుణంగా ప్రభుత్వం రాణించడానికి అవకాశం ఉంటుంది. దానికి అనుగుణంగా ఉపాధ్యాయులు సరైన న్యాయం చేకూరుస్తారని ఆకాంక్షిస్తూ, వారి సమస్యలను ప్రస్తావించడానికి సరైన సమయాన్ని ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తూ, భగవంతుడు మీకు తప్పనిసరిగా ఆయురారోగ్య ఆయుష్షులను సమకూర్చాలని కోరుతున్నాను.

మిస్టర్ చైర్మన్ : మీరు చాలామంది ఉన్నారు. మీరు అనుమతినిస్తే తర్వాత కొనసాగించవచ్చును.

శ్రీ ఎం. మాణిక్‌రావు : అధ్యక్షా, నేను బలహీన వర్గాల నుంచి వచ్చాను. You are the President of the Backward Classes Association. I also belong to Backward Class. So, I pray to God to give you strength and power. అందరినీ బలహీనవర్గాలని నేను అనడం లేదు గానీ, I am requesting everybody as a champion of Backward Classes, you have come to this seat. I have been a Member in the year 1964. I am the seniormost man. But I take only one minute. On behalf of the Backward Classes people, I am appealing to God to give time to you and to give you so much chance in future to work more. When the subject comes,

teachers are talking about teachers, professors are talking about professors and other people are talking about everything. But I am saying that this Government has come to power depending on 72% BCs. Soniaji and Indiraji have come to power because of the support of the Backward Classes people. Thanks to the Chief Minister because of his efforts only this Council has come. I pray to God to give you more strength so that you will help backward classes people.

మిస్టర్ ఛైర్మన్ : మీ యొక్క సూచనలు, అభినందనలకు నేను జవాబు చెప్పాలని నా అభిప్రాయం.

శాసన సభకు ఏకగ్రీవంగా ఎన్నుకున్న మీ అందరకూ నా హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు. క్లిష్టమైన వర్తమాన చరిత్రలో ఈ విధి నిర్వహణ ఎంత కీలకమైనదో నాకు తెలుసు. వినమ్రతతో అంకితభావంతో ఈ పదవీ బాధ్యతలు చేపడుతున్నాను. ఇంతకు ముందు గౌరవ ముఖ్యమంత్రి గారు, ఆయన సహచరులు, ప్రత్యేకించి గౌరవనీయులైన శాసన సభా వ్యవహారాలు, ఆర్ధిక శాఖా మంత్రి రోశయ్య గారు, ప్రతిపక్షనేతలు, గౌరవ సభ్యులు నన్ను అభినందిస్తూ ప్రసంగాలు చేశారు. వారికి నా వందనాలు. గడచిన సభలో చీఫ్ విప్‌గా, శాసన మండలి ఉపాధ్యక్షులుగా, సభ్యునిగా, వివిధ ఉపసంఘాల అధ్యక్షునిగా 9 సంవత్సరాల పాటు సాగిన నా అనుభవం దృష్ట్యా శక్తి వంచన లేకుండా, మీ అందరకూ సర్వేసర్వత్రా ఆమోదయోగ్యంగా ఈ పదవిని నిర్వహించగలనని మనవి చేస్తున్నాను. ఉదాత్త ఆశయాలతో 1958లో మొట్టమొదటిసారిగా ఏర్పాటు కాబడిన రాష్ట్ర శాసన మండలి 1985లో రద్దు కాబడింది. 27 సంవత్సరాల మన సుదీర్ఘ చరిత్రలో ఈ సభ విజయవంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా తన బాధ్యతలను నెరవేర్చిన సంగతి మీకు తెలుసు. ఆనాటి కార్యక్రమాలు ఎంతో హుందాతనంతో, అంకితభావంతో ఉట్టిపడేవి. ఆంధ్ర పితామహుడు మాడపాటి హనుమంతరావు, గొట్టిపాటి బ్రహ్మయ్య, పిడతల రంగారెడ్డి, తోట రామస్వామి, నివర్తి వెంకట సుబ్బయ్య, సయ్యద్ ముఖాశీర్నా ఈ అధ్యక్ష పీఠాన్ని అలంకరించి, ఎంతో ప్రతిభతో పెద్దరికంతో సమన్వయదృష్టితో ఈ శాసన సభకు వన్నె తెచ్చారు. వారు ఈనాడు మన మధ్య లేరు. ఆ సభలోను, ఈనాటి మన సభలోనూ ఉన్న గౌరవనీయులు రోశయ్య గారు మనకు ఎంతో ఖ్యాతి తెచ్చారు. వారు మన మధ్య ఉండటం చాలా సంతోషం. వారి సాంప్రదాయాలు మనం పాటించడం మన పవిత్ర కర్తవ్యం. సుదీర్ఘ కాలం ఆనాటి శాసన సభలో అలంకరించిన పాత తరం సభ్యులందరికీ పేరు పేరునా నా ఆప్యాయతను తెలియజేసుకుంటున్నాను. స్మరించుకుంటున్నాను. నా నివాళిని తెలుపుతున్నాను. 3 దశాబ్దాల నా రాజకీయ జీవితంలో ఎంతో మంది పెద్దల సాహచర్యంతో, సాన్నిహిత్యంతో నాకు క్రమశిక్షణను నేర్పడమే కాకుండా నా ఆలోచనలపై, నా జీవితంపై ఎంతో ప్రభావం చూపారు. వారికి నా సుమాంజలి.

ఈరోజు దాదాపు 22 సంవత్సరాల తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ ఏర్పడటం ముదావహం. దీనికి మన ముఖ్యమంత్రి గౌ. వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు చూపిన చొరవ, దూరదృష్టి హర్షదాయకం . అందుకు గౌ. ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి గారికి, అందుకు తోడ్పడిన గౌ.ఆర్థిక శాఖ , శాసన సభ వ్యవహారాల మంత్రి రోశయ్య గారికి రుణపడి ఉన్నాము.

మ .12 .20

ఇటీవల కొన్ని పరిణామాలు దేశ పార్లమెంటరీ వ్యవస్థలో చోటు చేసుకుంటున్నాయి . కొన్నిసార్లు ఆవేశంతో తొందరపాటుతో చట్టాలు చేయడం సంభవిస్తుంటుంది . ఈ పరిణామాలను ఎంతో కొంత నియంత్రించాలి . సమగ్రమైన చర్చల ద్వారానే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పరిరక్షించబడుతుంది . ఈ

నేపథ్యంలోనే శాసనమండలి ఏర్పాటును గురించి జాతీయస్థాయిలో విధాన నిర్ణయం చేయడం ఎంతైనా అవసరం ఉంది . మహాభారతంలో స్ఫూర్తిదాయకమైన ఒక సూక్తిని మీకు మనవిచేస్తున్నాను . ఏ సభలో పెద్దలు లేరో, దానిని సభ అనడానికి వీలులేదు . ఏ పెద్దలు ధర్మాన్ని గురించి మాట్లాడరో, వారిని పెద్దలు అనడానికి వీలులేదు . ఎక్కడ సత్యం లేదో అక్కడ ధర్మం లేదు . ఏది వంచనకు దారితీస్తుందో, అది సత్యం కావడానికి వీలులేదు . ఈ ఆలోచనా స్రవంతిలో గౌరవసభ్యులందరికీ స్వాగతం పలుకుతున్నాను . మీ అందరికీ అదృష్టం , భగవంతుని కృప తోడు కావాలని ప్రార్థిస్తున్నాను. నేటి సభలో పలువురు పెద్దలు, అనుభవజ్ఞులు, కోవిదులు, మేధావులు, దీక్షాపరులు నిస్వార్థపరాయణులు ఉన్నారని నాకు తెలుసు . మన చర్చలు సంకుచితం, పరస్పర నిందాపూర్వకంగా కావడానికి వీలులేదు . . మనం చేసే చర్చలు , తీర్మానాలు, చట్టాలు రాష్ట్రప్రజల దైనందిన సమస్యలకు, రాష్ట్ర ప్రయోజనాలకు నిరంతరం తరుణోపాయాలను చూపాలి . అమెరికా సెనేట్ లాగా మన దేశ రాజ్యసభ లాగా, మన రాష్ట్ర శాసనసభ పరిషత్తు కూడా మానవతా విలువలు కలిగిన ఆదర్శప్రాయమైన ప్రజాస్వామ్య వేదికగా కావాలి . అప్పుడే దానికి సార్థకత సిద్ధించగలదు . అందుకనుగుణంగా మనలను ముందుకు నడిపించడానికి నైతిక విలువలు కల కమిటీలు ఈ సభకు ఉండాల్సిన అవసరం ఉంది . మీ అందరికీ మరొకసారి హార్థిక స్వాగతం , హృదయపూర్వకమైన అభినందనలు .

## ప్రకటనలు

### 1. రాజాజీ యిన్‌స్టిట్యూట్ వారిచే కౌన్సిల్ సభ్యులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ గురించి.

CHAIRMAN: I am to announce to the House that Rajaji International Institute of Public Affairs and Administration will organize Orientation Programme for the Members of the House at 4.00 p.m. on Monday, the 9th April, 2007 in the Jubilee Hall. All the Members are requested to participate in the programme.

### 2. బిజినెస్ అడ్వయిజరీ కమిటీకి సభ్యుల నామినేషన్ గురించి

I am to announce to the House that the following Members are nominated to the Business Advisory Committee for this first Session:

1. Sri A.Chakrapani ---- Chairman
2. Dr.Y.S.Rajasekhara Reddy, Hon'ble Chairman ---- Member
3. Sri K.Rosaiah, Minister for Finance and Legislative Affairs ---- Member
4. Sri Mohd Ali Shabbir, Minister for Information and Public Relations ---- Member
5. Sri Puvvada Nageswara Rao ---- Member
6. Sri Palle Raghunatha Reddy ----- Member
7. Sri Kapilavai Dileep Kumar ----- Member
8. Sri B.Mohan Reddy ---- Member

The first meeting of the Committee will be held after the adjournment of the House today in my chambers.

Before adjourning the House, I would like to remind all the Members that today at 4.-00 pm the Hon'ble Governor will address the Members of both the Houses of Legislature in the Old Assembly Hall. All the Members are requested to attend the Governor's address.

Now the House is adjourned to meet again at 10.00 am tomorrow the 4th April, 2007.

(Then the House was adjourned at 12.25 pm., to meet again at 10.00 am tomorrow the 4th April, 2007)

## సభా కార్యక్రమము

*****

On arrival at the Main Entrance of the Central Hall, the Governor was received by the Hon'ble Chairman, Andhra Pradesh Legislative Council, Hon'ble Speaker, Andhra Pradesh Legislative Assembly and the Secretary to the State Legislature.

A procession was then formed in the Main Verandah of the Central Hall and the Governor was led into the Main Hall by the Aide-de-Camp to the Governor in front and by the Hon'ble Chairman and the Hon'ble Speaker followed by the Secretary to the Governor and the Secretary to the Legislature.

As the procession entered the Main Hall, the Governor's arrival was announced by the Officer on Special Duty, Legislature Secretariat and all the Hon'ble Members rose at their seats.

On the Dais, the Chairman was seated left and the Speaker was seated to the right of the Governor. The Governor then began his Address in English at 4.00 P.M.

## గవర్నరు గారి ప్రసంగము (అనుబంధము -1)

After the Governor concluded his Address at 5.00 p.m., the procession was re-formed in the same order and proceeded to the main entrance of the Central Hall. As the Governor was leaving the Hall, all the Hon'ble Members rose from their seats.

The House then dispersed.

(While the Governor was addressing, Members belonging to the Telugu Desam Party displayed placards containing the slogans like-

SRI P.KESAV: Productivity has come down Sir. We are getting rice from Punjab.
(Page No. 7 Para 2)

DR. N.JANARDHAN REDDY: No, we don't want Sir.
(Page No.9 Para 1)

SRI P.KESAV: No farmers' approval is there for this Sir.
(Page No.9, para 1)

SRI P.KESAV: This is going against Sonia Gandhi's wishes. It is an anti-poverty policy, Sir.
(Page No.16, para 1)

SRI P.KESAV: No power Sir.
(Page No.16, Para 2)

DR. N.JANARDHAN REDDY: This is a total fraud Sir. We will prove it.
(Page No.19, Para 1)

DR. N. JANARDHAN REDDY: The funds are diverted Sir.
(Page No.20, Para 2)

DR. N.JANARDHAN REDDY: No scholarships.
(Page No.20, Para 2)

SRI P.KESAV: Backward people are going still backward Sir.
(Page No.21, Para 1)

SRI P.KESAV: No money is released.

(Page No.21, Para 1)

SRI P.KESAV: Sir, G.O.No.760 is against the toddy tappers.
(Page No. 21, Para 2)

SRI P.KESAV: Only private, no public.
(Page No.24, para 3)

SRI P.KESAV: It is on the paper Sir
(Page No.26, para 1)

. N.JANARDHAN REDDY: There is no democracy in local bodies Sir.)
(Page No.42, Para 1)

After the Governor concluded his Address at 12.40 p.m., the procession was re-formed in the same order and proceeded to the main entrance of the Central Hall. As the Governor was leaving the Hall, all the Hon'ble Members rose from their seats.

The House then dispersed.